



ఆర్ఎన్ఐ/2009/ 28733

స్థాపితం : 2003

# ఆంధ్రనాడు

తెలుగు దినపత్రిక

సంపుటి : 22 సంచిక: 254 తిరుపతి తేది : గురువారం 21 ఆగస్టు 2025 పేజీలు : 08 ధర : రూ.6 PUBLISHED FROM TIRUPATI, CHITTOOR, ANNAMAIAH, ANANTHAPUR DISTRICTS



## ప్రతిపక్ష రాష్ట్రాలను కూల్చే కుట్ర

- మూడు రాజ్యాంగ సవరణ బిల్లులపై దద్దరిల్లిన లోక్‌సభ
- ఆందోళన మధ్యే బిల్లులు ప్రవేశపెట్టిన అమిత్ షా
- 'పిఎం, సిఎం, మంత్రుల' బిల్లు జెపిసికి
- ప్రతిపక్ష మహిళ ఎంపీలను నెట్టేసిన కేంద్రమంత్రులు

**న్యూఢిల్లీ –ఆంధ్రనాడు, ఆగస్టు 20:**

కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రవేశపెట్టిన మూడు వివాదస్పద బిల్లులపై లోక్‌సభ దద్దరిల్లింది. సభలో తీవ్ర గందరగోళం నెలకుంది. సభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తోపులాట జరిగింది. ప్రతిపక్ష మహిళా ఎంపీలను కేంద్ర మంత్రులు నెట్టేశారు. దర్యాప్తు సంస్థలు అరెస్టు చేసి 30 రోజుల పాటు నిర్బంధంలో ఉంటే 31వ రోజే ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, మంత్రుల పదవులు పోయేలా వీలు కల్పించే మూడు రాజ్యాంగ సవరణ బిల్లులను లోక్‌సభలో కేంద్ర ప్రవేశపెట్టింది. ఈ బిల్లులను ప్రనతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దర్యాప్తు సంస్థలతో ప్రతిపక్షపాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూలదోసే కుట్రలో భాగంగానే ఈ బిల్లును మోడీ ప్రభుత్వం తీసుకొస్తున్నదని ఆరోపించాయి. ఈ ఆందోళనల నడుమే కేంద్ర హెూంమంత్రి అమిత్ షా ఈ బిల్లులను సభలో ప్రవేశపెట్టారు. వివాదాస్పద బిల్లును ప్రవేశపెట్టే సమయంలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తోపులాట జరిగింది. ఈ నేపథ్యంలో రాజ్యాంగ వ్యతిరేక బిల్లులంటూ,

- మిగతా 2లో..

## ఇన్నోవేషన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా ఏపీ

- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు అదిరిపోయే ఆరంభం..
- గిన్నిస్ బుక్‌లోకెక్కిన ఆంధ్రప్రదేశ్
- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం రోజే ఏపీకి గిన్నిస్ వరల్డ్ రికార్డు
- కేవలం 24 గంటల్లో 1,67,321 స్టార్టప్‌ల రిజిస్ట్రేషన్‌తో సరికొత్త చరిత్ర
- సీఎం చంద్రబాబు, టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ చేతుల మీదుగా హబ్ ప్రారంభం
- అమరావతితో పాటు మరో నాలుగు నగరాల్లో ఇన్నోవేషన్ కేంద్రాల ఏర్పాటు
- ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యమన్న సీఎం
- ఆవిష్కరణల కేంద్రంగా ఏపీని తీర్చిదిద్దుతామని చంద్రబాబు స్పష్టం




**అమరావతి –ఆంధ్రనాడు, ఆగస్టు 20:**

ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణల రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించింది. రాష్ట్రంలో యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్' (ఆర్టీఐహెచ్) ప్రారంభోత్సవం రోజే అరుదైన ప్రపంచ రికార్డును సొంతం చేసుకుంది. కేవలం 24 గంటల వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 1,67,321 ఇన్నోవేషన్, బిజినెస్ స్టార్టప్‌లు రిజిస్టర్ కావడం ద్వారా ఈ అసాధారణ ఘనత సాధ్యమైంది. ఈ రికార్డును గుర్తిస్తూ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారిక ధృవపత్రాన్ని అందజేశారు. ఈ అద్భుతమైన ఆరంభం, రాష్ట్రంలో స్టార్టప్‌ల పట్ల యువతలో ఉన్న ఆసక్తికి, ప్రభుత్వ ప్రోత్సాహానికి నిదర్శనంగా నిలిచింది. బుధవారం నాడు మంగళగిరిలోని మయూరి టెక్ పార్కులో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు, టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్‌తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఆవిష్కరణలకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ హబ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. "రతన్ టాటా గారి నిరాడంబరత, దేశానికి ఆయన చేసిన సేవ అందరికీ ఆదర్శం. ఆయన ఆలోచనలను భవిష్యత్ తరాలకు అందించాలనే సదుద్దేశంతో, 'గివ్ బ్యాక్ టు ది సొసైటీ' అనే ఆయన విధానాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ ఇన్నోవేషన్ హబ్‌కు శ్రీకారం చుట్టాం" అని చంద్రబాబు వివరించారు. ఈ హబ్ ద్వారా యువతలోని వినూత్న ఆలోచనలను గుర్తించి, వాటిని

- మిగతా 2లో..



## 'అగ్ని-5' పరీక్ష విజయవంతం

- ఒడిశాలోని అబ్దుల్ కలాం ద్వీపం నుంచి ప్రయోగం
- 5,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల సత్తా
- అణ్వాయుధాలను మోసుకెళ్లగల సామర్థ్యం
- కచ్చితత్వంతో లక్ష్యాన్ని తాకినట్లు తెలిపిన అధికారులు
- రక్షణ రంగంలో భారత్ మరో కీలక ముందడుగు

2

## 15 రోజుల్లోగా ఇళ్లు లేని పేదల జాబితా

- గృహ నిర్మాణ శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- వచ్చే ఏడాది మార్చి కల్లా 10 లక్షల ఇళ్ల నిర్మాణం
- నెల రోజుల్లో 3 లక్షల కుటుంబాలకు గృహప్రవేశాలు



**అమరావతి– ఆంధ్రనాడు, ఆగస్టు 20**

రాష్ట్రంలో ప్రతీ పేద కుటుంబానికి సొంతిళ్లు ఉండాలని... ఇందుకోసం తలపెట్టిన గృహనిర్మాణ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి 10 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలనే లక్ష్యాన్ని నిర్దేశించిన ముఖ్యమంత్రి... వీటిలో 3 లక్షల ఇళ్లకు వచ్చే నెలలో గృహ ప్రవేశాలు జరగాలని స్పష్టం చేశారు. సంక్రాంతి కల్లా మరో 2 లక్షల ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. ప్రస్తుతం చేపట్టిన ప్రాజెక్టులను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి నిర్మాణం చేపట్టాలని సూచించారు. బుధవారం నాడు సచివాలయంలో గృహ నిర్మాణ శాఖపై అధికారులతో సమీక్షించిన సీఎం.... రాష్ట్రంలో ఇంకా ఇళ్లులేని పేద కుటుంబాలను గుర్తించి జాబితా రూపొందించాలని ఆదేశించారు. దీనిపై

- మిగతా 2లో..



## ఎన్‌డిఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు

**న్యూఢిల్లీ – ఆంధ్రనాడు, ఆగస్టు 20**

ఎన్‌డిఎ కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్ బుధవారం తన నామినేషన్ దాఖలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రుల సమక్షంలో నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. నామినేషన్ ప్రక్రియలో భాగంగా నాలుగు సెట్ల పేపర్లు దాఖలు చేశారు. తొలి సెట్‌కు చీఫ్ ప్రపోజర్‌గా

- మిగతా 2లో..

## అర్హులైన నేతన్నలకు ముద్ర రుణాలు

- సహాయ సంఘాల ఎన్నికలకు సమాయత్తం
- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత



**మంగళగిరి –ఆంధ్రనాడు, ఆగస్టు 20:**

అర్హులైన నేతన్నలందరికీ సకాలంలో ముద్ర రుణాలు అందజేయాలని అధికారులకు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత ఆదేశించారు.

2లో

## 4 రోజుల్లో రూ.19 కోట్ల రాయితీ

- స్త్రీ శక్తి' పై మంత్రి కొలుసు




**అమరావతి –ఆంధ్రనాడు, ఆగస్టు 20:**

మహిళల అభ్యున్నతిని, సంక్షేమాన్ని కాంక్షిస్తూ ప్రభుత్వం స్త్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిందని సమాచార శాఖ మంత్రి పార్థసారథి తెలిపారు. రాష్ట్ర సచివాలయంలోని

2

## నీటి కుంటలో దిగి ఆరుగురు విద్యార్థులు మృతి

- కన్నీటి సంద్రమైన చిగిలి గ్రామం
- సిఎం చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ విచారం

**కర్నూలు –ఆంధ్రనాడు, ఆగస్టు 20:**

కర్నూలు జిల్లా ఆస్పరి మండలంలో విషాదం చోటు చేసుకుంది. స్కూలు ముగిసిన తర్వాత సరదాగా ఈతకు దిగిన ఆరుగురు విద్యార్థులను నీటి కుంట కబలించింది. ఈ హృదయ విదారకమైన సంఘటన చిగిలి గ్రామంలో చోటుచేసుకుంది. మృతుల్లో ఇద్దరు అన్నదమ్ముల పిల్లలు, మరో ఇద్దరు రెండు కుటుంబాలల్లో ఏకైక కుమారులు కలరు. విద్యార్థులందరూ ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆరు గురు చిన్నారులు మృతిచెందడం పట్ల సిఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంతో



శశికుమార్ (ఫైల్) కిన్నెర సాయి (ఫైల్) సాయి కిరణ్ (ఫైల్)
భీమేష్ (ఫైల్) వినయ్ (ఫైల్) మహబూబ్ బాష (ఫైల్)

భవిష్యత్తు ఉన్న చిన్నారుల మృతి తల్లిదండ్రులకు తీరని కడుపు కోత మిగిల్చిందన్నారు. మృతుల

- మిగతా 2లో..

## నీటి కుంటలో దిగి
# ఆరుగురు విద్యార్థులు మృతి

(మొదటి పేజీ తరువాయి)
కుటుంబాలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. నీటిలో మునిగి మరణించడం తీవ్రంగా కలిచివేసిం దని జగన్ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుం బాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.గ్రామస్తుల సమాచారం మేరకు.. చిగిలి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువు తున్న ఐదవ తరగతి విద్యార్థులు శశి కుమార్ (10), కిన్నెర సాయి (10), సాయికిరణ్ (10), భీమేష్ (10), వినరు (10), మహబూబ్ బాషా (10), దుర్గప్రసాద్‌లు కలిసి స్కూలు ముగిసిన తర్వాత పాఠశాలకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న నీటి కుంటలో ఈతకొట్టేందుకు వెళ్లారు. శశి కుమార్, కిన్నెరసాయి, సాయికిరణ్, భీమేష్, వినరు, మహబూబ్‌బాషా నీటికుంటలోకి దిగారు. దుర్గప్రసాద్ ఒడ్డున ఉండిపోయారు. ఇటీవల కురిసిన వర్షాలకు కుంటలోకి భారీగా వరద నీరు చేరింది. కుంటలో ఈతకు దిగిన ఆరుగురు విద్యార్థులు బురదలో చిక్కుకుపోయారు. ఒడ్డుకు రాలేక ఊపిరాడక ఐదుగురు కుంటలోనే మరణించారు. స్నేహితులు ఒడ్డుకు చేరుకోకపోవడాన్ని దుర్గ ప్రసాద్ గమనించి గ్రామంలోకి వెళ్లి విషయం చెప్పారు. గ్రామస్తులు కుంట వద్దకు చేరుకుని ఆరుగురిని ఒడ్డుకు చేర్చారు. కిన్నెరసాయి కొన ఊపిరితో ఉండడంతో ఆదోనికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించారు. మృతి చెందిన విద్యార్థుల్లో భీమేష్, సాయికిరణ్ వారి తల్లిదండ్రులకు ఏకైక కుమారులు. ఉన్న ఒక్క కుమారుడిని ఉన్నతంగా చదివించాలని ఎంతో ఆశపడ్డామని, ఇలా విగతజీవులుగా మారతారని ఊహించలేదని తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు పలువురుని కంటితడి పెట్టించింది.

**మృత్యువులో కూడా వీడని స్నేహం**

శశి కుమార్, కిన్నెర సాయి అన్నదమ్ముల కుమారులు. ప్రతిరోజు ఇంటి నుంచి కలిసి పాఠశాలకు వెళ్లే అన్నదమ్ములు మృత్యువులో కూడా కలిసిపోయారని మృతుల తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

**రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి : ఎమ్మెల్యే విరుపాక్షి**

మృతుల కుటుంబీకులను ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..పాఠశాల సమీపంలోనే గుంత తవ్వి వదిలివేయడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందన్నారు. మృతుల కుటుంబీకులకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

## 'అగ్ని-5' పరీక్ష
# విజయవంతం

**- ఒడిశాలోని అబ్దుల్ కలాం ద్వీపం నుంచి ప్రయోగం - 5,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల సత్తా - అణ్వాయుధాలను మోసుకెళ్లగల సామర్థ్యం**
**- కచ్చితత్వంతో లక్ష్యాన్ని తాకినట్లు తెలిపిన అధికారులు - రక్షణ రంగంలో భారత్ మరో కీలక ముందడుగు**

**న్యూఢిల్లీ –ఆంధ్రనాడు, ఆగస్టు 20:** మధ్యంతర శ్రేణి బాలిస్టిక్ క్షిపణి 'అగ్ని–5'ని భారత్ బుధవారం విజయవంతంగా పరీక్షించింది. ఈ విషయాన్ని కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఒడిషాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి నిర్వహించిన ఈ ప్రయోగం.. అన్ని సాంకేతిక, కార్యాచరణ ప్రమాణాలను అందుకున్నట్లు తెలిపింది 'స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్' ఆధ్వర్యంలో ఈ పరీక్ష జరిగినట్లు తెలిపింది. 5 వేల కిలోమీటర్ల వరకూ అగ్ని లక్ష్యాలను ఛేధింగలదని తెలిపింది.

కాగా, చివరిసారిగా గతేడాది మార్చి 11న 'మిషన్ దివ్యాస్త్ర' పేరుతో.. బహుళ లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యంతో రూపొందించిన 'అగ్ని–5' క్షిపణిని భారత్ విజయవంతంగా పరీక్షించింది. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ అధునాతన క్షిపణిని 'మల్టీపుల్ ఇండిపెండెంట్ టార్గెటబుల్ రీ–ఎంట్రీ వెహికల్ సాంకేతికతతో అభివద్ధి చేశారు. దీనిద్వారా ఒకే క్షిపణి సాయంతో అనేక వార్‌హెడ్లను వేర్వేరు లక్ష్యాలపై ప్రయోగించవచ్చు.

# 4 రోజుల్లో రూ.19 కోట్ల రాయితీ

(మొదటి పేజీ తరువాయి)
పబ్లిసిటీ సెల్‌లో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పథకాన్ని ప్రారంభించిన 4 రోజుల్లో 47 లక్షల మంది సద్వినియోగం చేసుకున్నట్లు చెప్పారు. దీంతో రూ.19 కోట్ల మేర రాయితీని పొందారని తెలిపారు. కొండ ప్రాంతాల్లో భద్రత దృష్ట్యా ఉచిత బస్సు ప్రయాణాన్ని తొలుత అనుమతించలేదని, తాజాగా ఘాట్ రోడ్డుల్లోను ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. బోగస్ సదరం ధృవీకరణ పత్రాలతో పెన్షన్ పొందుతున్న అనర్హుల ఏరివేతకే సదరం ధృవీకరణ పత్రాల పరిశీలన జరుగుతుందన్నారు. రాష్ట్రంలో 7.86 లక్షల మంది వికలాంగుల పెన్షన్ పొందుతున్నారని, వారిలో 5.10 లక్షల మందికి సదరం ధృవీకరణ పత్రాల పరిశీలనకు నోటీసులు అందించినట్లు చెప్పారు. ఇప్పటి వరకూ 4.50 లక్షల మంది మాత్రమే వారి ధృవీకరణ పత్రాలు పన్ణపరిశీలన చేయించుకున్నారని, మిగిలిన వారు ముందుకు రాలేదని తెలిపారు. అత్యధికంగా 1,708 బోగస్ పెన్షన్‌లు పులివెందులలో, 1,604 చంద్రగిరిలో, 1,539 మచిలీపట్నంలో గుర్తించడం జరిగిందని తెలిపారు.

## ఎన్‌డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి
# సిపి రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు

(మొదటి పేజీ తరువాయి)
ప్రధాని మోడీ సంతకం చేశారు. దీనికి ముందు ప్రేరణా స్థల్ వద్ద మహాత్మాగాంధీ విగ్రహానికి రాధాకృష్ణన్ నివాళులర్పించారు. నామినేషన్ కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బిజెపి జాతీయ అధ్యక్షుడు, ఆరోగ్య శాఖ మంత్రి జెపి నడ్డా, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కిరణ్ రిజిజు, రామ్మోహన్ నాయుడు, లావు శ్రీకృష్ణదేవరాయులు (టిడిపి), లలన్ సింగ్ (జెడియు), చిరాగ్ పాశ్వాన్ (ఎల్‌జెపి), అనుప్రియ పటేల్ (అప్నాదల్), తంబిదొరై (అన్నాడిఎంకె), రాందాస్ అథ్వాలే (ఆర్‌పిఐ), కుమారస్వామి (జెడిఎస్), ప్రఫుల్ పటేల్ (ఎన్‌సిపి–అజిత్ పవర్), జయంత్ చౌదరి (ఆర్‌ఎల్‌డి), శ్రీకాంత్ షిండే (శివసేన–షిండే) తదితరులు పాల్గొన్నారు.

**నేడు సుదర్శన్ రెడ్డి నామినేషన్**

గురువారం ప్రతిపక్ష ఇండియా బ్లాక్ ఉపరాష్ట్రపతి అభ్యర్థి మాజీ న్యాయమూర్తి బి.సుదర్శన్ రెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నారు. ప్రతిపక్ష ఇండియా బ్లాక్ నేతలంతా ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. కాగా సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజ్ ప్రక్రియతో ఎన్నిక నిర్వహిస్తారు.

# ఇన్నోవేషన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా ఏపీ

(మొదటి పేజీ తరువాయి)
వివిజయవంతమైన వ్యాపారాలుగా మార్చేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

**రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ.. ఇంటికో పారిశ్రామికవేత్త లక్ష్యం**

ఈ ఇన్నోవేషన్ కేంద్రాలను కేవలం అమరావతికే పరిమితం చేయకుండా 'హబ్ అండ్ స్పోక్' మోడల్‌లో రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నట్లు సీఎం తెలిపారు. అమరావతి ప్రధాన కేంద్రంగా పనిచేస్తుండగా, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురంలో అనుబంధ కేంద్రాలు పనిచేస్తాయని చెప్పారు. భవిష్యత్తులో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ ఇన్నోవేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసి, స్థానిక యువతకు అవకాశాలు కల్పించాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. "ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలనేదే నా నినాదం. ఈ లక్ష్య సాధనలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కీలక పాత్ర పోషిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. సరైన ప్రభుత్వ విధానాలతో సంపద సృష్టించడం ద్వారానే సంక్షేమం సాధ్యమవుతుందని, గతంలో ఐటీ రంగాన్ని ప్రోత్సహించిన తరహాలోనే ఇప్పుడు స్టార్టప్‌లకు ఊతమిస్తున్నామని అన్నారు.

**టెక్నాలజీతో అభివృద్ధి.. అమరావతిలో క్వాంటం వ్యాలీ**

టెక్నాలజీ వల్ల ఉద్యోగాలు పోతాయన్న వాదనను తాను నమ్మనని, టెక్నాలజీ కొత్త అవకాశాలను సృష్టిస్తుందని చంద్రబాబు అన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, రక్షణ వంటి అనేక రంగాల్లో ఆవిష్కరణలకు అపారమైన అవకాశాలున్నాయని యువతకు సూచించారు. "అమరావతి నగరాన్ని క్వాంటం కంప్యూటింగ్ హబ్‌గా అభివృద్ధి చేస్తాం. క్వాంటం వ్యాలీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటివి భవిష్యత్తులో విప్లవాత్మక మార్పులు తేబోతున్నాయి. ఈ అవకాశాలను అందిపుచ్చుకునేలా రాష్ట్రాన్ని సిద్ధం చేస్తున్నాం" అని తెలిపారు. ఒకవైపు సంపద సృష్టిస్తూ, మరోవైపు 'పీ4' (ప్రజా భాగస్వామ్యంతో పేదరికంపై పోరాటం) ద్వారా పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తామని, 'వెల్తీ, హెల్తీ, హ్యాపీ సొసైటీ'గా ఏపీని మారుస్తామని పునరుద్ఘాటించారు. టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతతో అతి తక్కువ సమయంలోనే ఇన్నోవేషన్ హబ్‌కు రూపమిచ్చారని ప్రశంసించారు. స్టార్టప్‌లకు ఇదొక అద్భుతమైన అవకాశమని, ఆరోగ్యం నుంచి వ్యవసాయం వరకు అనేక రంగాల్లో వినూత్న పరిష్కారాలు కనుగొనేందుకు ఈ కేంద్రం వేదికగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, టీజీ భరత్, భారత్ ఫోర్జ్ చైర్మన్ బాబా కల్యాణి, అమర్ రాజా బ్యాటరీస్ చైర్మన్ గల్లా జయదేవ్ తదితర పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. అనంతరం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టార్టప్ కంపెనీల స్టాళ్లను ముఖ్యమంత్రి సందర్శించి, వారి ఉత్పత్తులను పరిశీలించారు.

# ప్రతిపక్ష రాష్ట్రాలను కూల్చే కుట్ర

(మొదటి పేజీ తరువాయి)
అవి ప్రతిపక్షాలపై కక్షపూరిత చర్యలకు ఉద్దేశించినవని ప్రతిపక్ష సభ్యులు బిల్లు కాపీలను చించి విసిరేశారు. ఈ సమయంలో ప్రతిపక్ష పార్టీలకు చెందిన మహిళా ఎంపీలను కేంద్రమంత్రులు నెట్టేవేశారని టిఎంసి ఎంపి కళ్యాణ్ బెనర్జీ విమర్శించారు. బుధవారం మధ్యాహ్నం తరువాత సభలో ఈ గందరగోళం చేటుచేసుకుంది. అనంతరం వీటిని జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)కి సిఫా రసు చేస్తూ తీర్మానం చేశారు.బుధవారం ముందుగా లోక్‌సభను స్పీకర్ ఓం బిర్లా ప్రారంభిస్తూ ప్రశ్నోత్తరాలు నిర్వహించేందుకు ప్రయత్నించారు. అయితే ప్రతిపక్ష సభ్యులు బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్)ను వెనక్కి తీసుకోవాలని వెల్‌లోకి దూసు కెళ్లి, ప్లకార్డులు చేబూని ఆందోళన చేపట్టారు. దీంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలోనూ ప్రతిపక్ష సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు. సభ్యుల ఆందోళన మధ్యే కేంద్ర ఐటీ, సమాచార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లును ప్రవేశపెట్టారు. అయితే సభను వెంటనే మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు.
అనంతరం తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్ష సభ్యులు వెల్‌లో తమ ఆందోళనను కొనసాగించారు. ప్రతిపక్షాల ఆందోళన మధ్యే అమిత్ షా కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ సవరణ బిల్లు, రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు, జమ్మూకాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లులన ప్రవేశపెట్టారు. దీన్ని ప్రతిపక్ష సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. బిల్లులకు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. కాంగ్రెస్ నేతలు కెసి వేణుగోపాల్, మనీశ్ తివారీ, ఆరెస్పీ నేత ఎన్‌కె ప్రేమ్‌చంద్రన్, ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసి, ఎస్‌పీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ ఈ మూడు బిల్లులను ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకించారు. బిల్లులను జెపిసి, లేదంటే సెలక్ట్ కమిటీకి పంపాలని సూచించారు. ప్రతిపక్ష ఎంపిలు బిల్లుల కాపీలను చించివేసి, కాగితపు ముక్కలను విసిరేశారు. అనంతరం స్పీకర్ సభను మధ్యాహ్నం మూడు గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలోకి భారీగా మార్షల్స్‌ను దింపారు. అయితే ప్రతిపక్ష సభ్యుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో కొంత మందిని మార్షల్స్‌ను వెనక్కి పంపించేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా సీటు ముందు ముగ్గురు మార్షల్స్‌ను పెట్టారు. ప్రతిపక్షాల ఆందోళన మధ్యే బిల్లులను ప్రవేశపెట్టి, మూజువాణి ఓటుతో ఆమోదించారు. అలాగే ఈ బిల్లులను కేంద్ర హోం మంత్రి అమిత్ షా జెపిసికి సిఫారసు చేస్తూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సభలోని 21 మంది సభ్యులను లోక్‌సభ స్పీకర్ జెపిసికి నామినేట్ చేయనున్నారు. రాజ్యసభలో 10 మంది సభ్యులను డిప్యూటీ చైర్మెన్ నామినేట్ చేయనున్నారు. సభలో ఉద్రిక్తతల నేపథ్యంలో సభను సాయంత్రం 5 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ఆన్‌లైన్ గేమింగ్ బిల్లును ఆమోదించారు. మరోవైపు రాజ్యసభలోనూ ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. బీహార్‌లో ఎస్‌ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నినాదాల హోరెత్తించారు. దీంతో రాజ్యసభ కూడా వాయిదాల పర్వం తొక్కింది. అనంతరం ఐఐఎం బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించారు.

## 15 రోజుల్లోగా
# ఇళ్లు లేని పేదల జాబితా

(మొదటి పేజీ తరువాయి)
15 రోజుల్లోగా సర్వే పూర్తి చేయాలన్నారు. పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు పేద కుటుంబాలకు ఇస్తామన్న హామీ మేరకు అవసరమైన స్థలాలను గుర్తించాలన్నారు. పెద్ద కుటుంబాలకు ఉమ్మడి ఇళ్లు నిర్మించే యోచన చేయాలన్నారు. ఎన్టీఆర్ హౌసింగ్ పూర్తి చేసేందుకు విడతల వారీగా నిధులు ఇవ్వాలని చెప్పారు.

**త్వరలో 2,73,709 మంది లబ్ధిదారులకు రూ.919 కోట్ల చెల్లింపు**

రాష్ట్రానికి పీఎంఏవై(అర్బన్)బీఎల్సీ, పీఎంఏవై (గ్రామీణ్), పీఎం జన్ మన్ కింద మొత్తం 18,59,504 ఇళ్లు మంజూరు కాగా... వీటిలో ఇప్పటికి 9,51,351 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది. ఈ ఏడాది కాలంలోనే 2.81 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. వచ్చే నెలలో ఇంకో 19 వేల ఇళ్లు అందుబాటులోకి వస్తాయి.

ఈ ఏడాది కాలంలో గృహ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.2,013.50 కోట్లు ఖర్చు చేసింది. రాష్ట్రంలో 50 శాతానికి పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిన మొత్తం 4,305 లేఅవుట్లలో... రహదారులు, డ్రైనేజీలు తదితర మౌలికవసతుల కోసం రూ.3,296.58 కోట్ల వ్యయం కానుంది. కుప్పం నియోజకవర్గంలో 4,647 మంది గృహ నిర్మాణ లబ్దిదారులకు రూ.16.37 కోట్లు చెల్లించగా, రాష్ట్రంలోని 2,73,709 మంది లబ్దిదారులకు రూ.919.29 కోట్లు త్వరలో చెల్లించనుంది.

పీఎం జన్ మన్ కింద నిర్మించిన 15,753 ఇళ్లకు రూ.100 కోట్లు, పీఎంఏవై గ్రామీణ్ కింద నిర్మించిన 15,582 ఇళ్లకు రూ.75 కోట్ల నిధులు మంజూరు చేయనుంది. మరోవైపు పీఎంఏవై అర్బన్ కింద ఇళ్లు మంజూరైనప్పటికీ 1,84,510 మంది లబ్దిదారులు ఇంకా గృహ నిర్మాణం చేపట్టలేదని అధికారులు ముఖ్యమంత్రికి వెల్లడించారు.

**తుది దశకు 84,094 టిడ్కో ఇళ్ల నిర్మాణం**

2018లో 104 పట్టణ స్థానిక సంస్థల్లో 4,54,706 టిడ్కో ఇళ్లకు టెండర్లు పిలవగా, వీటిలో ప్రస్తుతం 1,77,546 ఇళ్లు పూర్తయ్యాయి.

వీటిలో 300 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన 45,848 ఇళ్లు, 365 చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న 12,550 ఇళ్లు, 430 చ.అ. విస్తీర్ణం ఉన్న 25,172 ఇళ్లు... మొత్తం 83,570 ఇళ్లను లబ్దిదారులకు ప్రభుత్వం అందించింది. మరో 84,094 టిడ్కో ఇళ్ల నిర్మాణం తుది దశకు చేరింది.

## అర్హులైన నేతన్నలకు
# ముద్ర రుణాలు

(మొదటి పేజీ తరువాయి)
చేనేత కుటుంబాలకు ఉచిత విద్యుత్తు ఫలాలు అందజేసేలా గ్రామ స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఆప్కో ద్వారా అమ్మకాలు పెంచాలని, ముఖ్యంగా నూతన డిజైన్లతో తయారు చేసిన చేనేత దుస్తులపై సోషల్ మీడియా ద్వారా వినియోగదారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆమె దిశా నిర్దేశం చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో చేనేత, జౌళి శాఖ కమిషనరేట్‌లో బుధవారం ఆయా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. చేనేత, జౌళి శాఖలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై కమిషనర్ రేఖారాణి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ వన్ డిస్ట్రిక్ %–% వన్ ప్రొడక్ట్ కింద రాష్ట్ర వ్యాప్తంగా 36 ఉత్పత్తులు గుర్తించామని, జిల్లాలో మరిన్ని ఉత్పత్తులను ఎంపిక చేయాలని సూచించారు. ఇటీవల కేంద్రం ప్రకటించిన ఒడి–ఒపి అవార్డుల్లో తొమ్మిది అవార్డులు ఎపికి రావడం ఆనందకరమంటూ అభినందించారు. రాష్ట్రంలో క్లస్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. చేనేతలకు ఇచ్చే ఉచిత విద్యుత్ పై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. రాష్ట్రంలో చేనేత సహకార సంఘాల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమవుతోందని తెలిపారు. నూతన సహకార సంఘాల ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులైన నేతన్నలకు ఈ ఏడాది డిసెంబర్ నాటికి నిర్దేశించిన లక్ష్యంలో 70 శాతం మేర ముద్ర రుణాలు అందించాలని స్పష్టంచేశారు. ఎయిర్ పోర్టుల్లో ఉన్న ఆప్కో షో రూమ్‌ల్లో చేనేత దుస్తులతో పాటు హస్త కళా రూపాలను కూడా అమ్మకానికి పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా, వివిధ జిల్లాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# లోకేష్ ఢిల్లీ పర్యటన
## - విద్యారంగానికి అదనంగా నిధుల్ని కేటాయించిన కేంద్రం



**అమరావతి – ఆంధ్రనాడు, ఆగస్టు 20:** ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తాజాగా ఢిల్లీ పర్యటనకు వెళ్లి పలువురు కేంద్ర మంత్రుల్ని కలిశారు. విద్యా రంగానికి అదనంగా నిధులిమ్మని కేంద్ర మంత్రుల్ని ఆయన కోరారు. దీనికి కేంద్రం స్పందించింది. కేంద్రం విద్యా రంగానికి భారీగా నిధులు విడుదల చేసింది. సమగ్ర శిక్షణ కోసం గతంలో కంటే ఈసారి ఏపీకి అదనంగా రూ.432.19 కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీంతో కూటమి ప్రభుత్వంలోని మంత్రులు కేంద్రం ఏపీకి ప్రాధాన్యతనిస్తుందని చెప్పుకుంటున్నారు.

# గణనాథుని హుండీ ఆదాయం రూ.1,67,32,780

### - హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఈవో పెంచల కిషోర్



**కాణిపాకం- ఆంధ్రనాడు, ఆగస్టు 20 :** గణనాథుని హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఈవో పెంచల కిషోర్. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి హుండీ లెక్కింపు ద్వారా 23 రోజులకు రాబడిన ఆదాయం రూ. 1,67,32,780 బంగారం 50 గ్రాములు, వెండి 1. కిలో 617 గ్రాములు,గో సంరక్షణ హుండీ ద్వారా 16,236 రూపాయలు.నిత్య అన్నదానం హుండీ ద్వారా రూ. 41,450 ఫారిన్ కరెన్సీ యూఎస్ఏ 397. డాలర్స్ . ఇంగ్లాండ్ 10. పౌండ్స్. యూఏఈ 230. ధీరమ్స్ . కెనడ- 105. డాలర్స్. ఈ రో, - 325. ఈ రో. ఆస్ట్రేలియా 70. డాలర్స్. సింగపూర్ 5. డోలర్స్. మలేషియా - 1. రింగ్గిట్స్ .ఆదాయం వచ్చినట్లు దేవస్థానం కార్యని ర్వాహణాధికారి పెంచల కిషోర్ తెలిపారు, ఈ హుండీ లెక్కింపులో పాల్గొన్నవారు, డి.ఈ.ఓ సాగర్ బాబు, చిత్తూరు జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ, ఏఈఓలు - ఎస్వి కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ప్రసాద్, ధనపాల్, సిఎఫ్ఓ నాగేశ్వరరావు, పర్యవేక్షకులు - కోదండపాణి, శ్రీధర్ బాబు, దేవస్థానం సిబ్బంది, సేవకులు, యూనియన్ బ్యాంక్ కాణిపాకం శాఖ, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయానికి రెండు టీవీలు విరాళం

### -ఆలయ ఈవో పెంచల కిషోర్‌కి అందజేత




**కాణిపాకం - ఆంధ్రనాడు, ఆగస్టు 20 :** స్వామి వారి ఆలయానికి రెండు టీవీలు విరాళం. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయానికి సాంసంగ్ కంపెనీ 55" 2 టీవీలు విరాళం సుమారు విలువ రూ .1,20,000 దాత చిత్తూరు విమ్సన్ అధినేత రవీంద్రనాథ్, రమణ, వీరికి దర్శన ఏర్పాటు చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసిన దేవస్థానం ఈ.వో పెంచలకిషోర్, ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, ఏ.ఈ పవన్ తదితరులు ఉన్నారు.

## వైభవంగా ప్రదోషకాల పూజలు



**కాణిపాకం-ఆంధ్రనాడు, ఆగస్టు 20** :వైభవంగా ప్రదోషకాల పూజలు. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం అనుబంధ దేవాలయమైన శ్రీ మణికంఠేశ్వర స్వామి వారి ఆలయము నందు బుధవారం సాయంత్రం ప్రదోషకాల పూజ సందర్భంగా వైభవంగా స్వామివారి మూలవిరాట్,నందీశ్వరుడుకి ఏకకాలంలో ప్రత్యేక అభిషేకములు,, ప్రత్యేక పూజలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో అర్చకులు, వేద పండితులు, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం వికలాంగుల పరికరాల పంపిణీలో గోల్మాల్

### - బీజేపీ నాయకుల ఆరోపణ

**రామకుప్పం -ఆంధ్రనాడు, ఆగస్టు 20:** కేంద్ర ప్రభుత్వం వికలాంగులకు పంపిణీ చేసిన పరికరాలలో కొందరు అనరులకు అందజేశారని రామకుప్ప0 మండలం బిజెపి నాయకులు లోకేష్ రెడ్డి ఆరోపించారు కనీసం కేంద్ర ప్రభుత్వ పథకమైన ఈ కార్యక్రమానికి బిజెపికి చెందిన వారికి సమాచారం అందించుకోవడం అధికారుల నిర్లొచ్చేదోల్ని తెలుస్తున్నదని ఆయన ఆరోపించారు అలింకో వారు కూడా ఈ విషయంలో ఏకపక్షం వహించారు,ఆయన పేర్కొన్నారు మిట్టపల్లికి చెందిన మంజుల ప్రమాదవశాత్తు గురి ఐన ఆమెకు వాహనం అందజేయుటలో నిర్లక్ష్యం వహించారు అనిమంజుల ఆవేదన చేశారు తనకు ప్రమాదవశాత్తు కాళ్లు పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు తనలాంటి వారికి ఆదుకోకపోవడం చాలా సో చనేమని ఆవేదన వ్యక్తం చేశారు దీనిపై పూర్తిస్థాయిలో జిల్లా కలెక్టర్ విచారణ చేయాలని కోరుచున్నారు.





# దోమల నివారణతోనే వ్యాధులకు దూరం

### -హెల్త్ సూపర్వైజర్ శివ శంకర్




**రేణిగుంట- ఆంధ్రనాడు, ఆగస్టు 20:** దోమల నివారణతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చు అని తారకరామ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్వైజర్ శివ శంకర్ అన్నారు. బుధవారం ఆర్. సి.ఎం. హైస్కూల్ నందు బుధవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్వైజర్ శివ శంకర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగష్టు 20 తేదిన ప్రపంచ దోమల నివారణ దినోత్సవం పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగు తుందని వివరించారు. అలాగే ప్రతి సంవత్సరం ఆగష్టు 20 వ తేదీన ప్రపంచ దోమల నివారణ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. సర్ రోనాల్డ్ రాస్ అను శాస్త్రవేత్త ఆడ అనాఫిలిస్ దోమ ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుందని గుర్తించిన రోజును ప్రపంచం దోమల దినోత్సవంగా పాటించడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే నీటి నిల్వలు లేకుండా,దోమలు వృద్ధి చెందకుండా చూడాలన్నారు. దోమల నివారణకు,దోమతెరలు వాడా లన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి, నీటి నిలువలు ఐదు రోజులకు మించి ఉంచరాదన్నారు. సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, బోదకాలు, మెదడు వాపు, వంటి వ్యాధులపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, ప్రజలకు దోమల ద్వారా వచ్చు వ్యాధుల పై అవగాహన కల్పించాలని, దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని, తెలియజేసారు. ఆరోగ్య సూత్రాలను పాటించి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి స్రవంతి, ఆరోగ్య కార్యకర్త, ఏఎన్ఎం, రేవతి, ఆశా కార్యకర్తలు పద్మ, అశ్విని, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనే కూటమి ప్రభుత్వం లక్ష్యం

### -పేటమిట్టలో జాబ్ మేళాను ప్రారంభించిన పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్




**ఐరాల- ఆంధ్రనాడు, ఆగస్ట్ 20 :** ఐరాల,పూతలపట్టు మండలం, పేటమిట్ట గ్రామంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాను పూతలపట్టు శాసనసభ్యులు.డాక్టర్ కలికిరి మురళీమోహన్ ప్రారంభించారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పేటమిట్ట అమరరాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నందు నిర్వహించిన జాబ్ మేళా ప్రారంభోత్సవానికి ముఖ్య అతిధిగా హాజరైన స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్ ని స్థానిక నాయకులు, అమరరాజా ప్రతినిధులు, వివిధ కంపెనీల ప్రతినిధులు దుశ్శాలువలు, పూలమాలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి జాబ్ మేళా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జాబ్ మేళాలో పాల్గొనే కంపెనీ ప్రతినిధులతో ఎమ్మెల్యే మాట్లాడి విద్య, నైపుణ్యం తగినట్టు ఉద్యోగం కల్పించాలని వివిధ కంపెనీల ప్రతినిధులకు సూచి ంచారు. ఈ జాబ్‌మేళలో ఎంపికైన యువతే యువకులకు అపాయింట్మెంట్ ఆర్డర్స్ ను ఎమ్మెల్యేచేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పూతల పట్టు శాసనసభ్యులు మురళీమోహన్ మాట్లా డుతూ... నిరు ద్యోగులకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలోని యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రాష్ట్రానికి వివిధ కంపెనీలను తీసుకు వచ్చేందుకు కృషి చేస్తూనే మరో వైపు జాబ్ మేళాలను నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పి స్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని చదువుకున్న యువతీ, యువకులు సద్వి నియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. జాబ్ మేళాలో ఉద్యోగం పొందని నిరుద్యోగులకు కోసం త్వరలోనే స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ కల్పించి జాబ్ మేళాను నిర్వహి స్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పూతల పట్టు నియోజకవర్గం పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ గిరిధర్ బాబు, బంగారుపాలెం మండల అధ్యక్షులు ఎన్ పి ధరణి నాయుడు, తవణంపల్లి మండలం అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, బంగారుపాలెం మార్కెట్ డైరెక్టర్ గురుస్వామి, పేటమిట్ట గ్రామ సర్పంచ్ గల్లా రాధాకృష్ణ నాయుడు, అమర్ రాజా ప్రతినిధులు, వివిధ కంపెనీల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, యువతీ, యువకులు పాల్గొన్నారు.

## పేదలకు ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్





**రామకుప్పం -ఆంధ్రనాడు, ఆగస్టు 20:** రామకుప్పంలో బుధవారం అన్న క్యాంటీన్ నిర్మాణానికి కొత్త బస్టాండ్‌లో భూమి పూజ కార్యక్రమాన్ని తెలుగు దేశం పార్టీ నాయ కులు ఘనంగా నిర్వ హించారు. అనంతరం జరిగిన సభలో తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ నాటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు పేదలు పట్టడన్న కోసం అవస్థలు పడకూడదని కిలో బియ్యం రెండు రూపాయలకు ప్రవేశపెట్టి పేదలకు ఆకలి తీర్చాడని కూడు గుడ్డ పేదవానికి అందే విధంగా పథకాలు పెట్టారన్నారు అదేవిధంగా నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకలితో ఎవరు బాధపడకూడదు అని నిరుపేదల కోసం అన్న క్యాంటీన్ ప్రవేశపెట్టాడని ఉదయం మధ్యాహ్నం సాయంత్రం మూడు పూటలా ఏ క్యాంటీన్ నందు ఐదు రూపాయలు కు భోజనం లభిస్తుందన్నారు ఒక్క రోజుకి సుమారు 50 వేల రూపాయల పైబడి ఖర్చవుతుందని పేర్కొన్నారు ఇస్కాన్ వారి ద్వారా భోజనం సరఫరా అవుతుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో కుప్పం ఆర్డీవో శ్రీనివాసరాజు, రామకుప్పం ఎంపీడీవో లక్ష్మీకాంత,రామకుప్పం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆనంద రెడ్డి ,మాజీ అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి, మాజీ జెడ్పిటిసి మునుస్వామి, నాయకులు చిన్ని కృష్ణ, చలపతి, వెంకటరమణ, రామమూర్తి, జయశంకర్, మురళి, కడ పాలకమండలి సభ్యులు రఘు, రెస్కో డైరెక్టర్లు విజయ్ కుమార్, సతీష్, ఇంకా పలువురు పాల్గొన్నారు.

## పెన్షనర్‌ల గ్రాట్యుటీ ఎప్పుడు చెల్లిస్తారు ..?

### - జిల్లా వైసీపీ ఉపాధ్యాయ విభాగం అధ్యక్షులు డిమాండ్



**పలమనేరు-ఆంధ్రనాడు, ఆగస్టు 20:** పదవీ విరమణ పొందిన ఉద్యోగ ఉపాధ్యాయులకు గత ఏడాది కాలంగా గ్రాట్యుటీ చెల్లించక పోవడం సమంజసం కాదని దానిని ఎప్పుడు చెల్లిస్తారో? చెప్పాలని వైఎస్ఆర్ పార్టీ అనుబంధ ఉపాధ్యాయ విభాగం చిత్తూరు జిల్లా అధ్యక్షులు ఎన్.సోమచంద్రా రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ మేరకు ఆయన బుధవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. సహజంగా పదవీ విరమణ పొందిన వారికి పెన్షన్ కమ్యూటేషన్ చెల్లించి గ్రాట్యుటీ ఒకేసారి చెల్లిస్తారని అయితే 2024 ఆగస్టు తదుపరి రిటైర్డ్ అయినవారికి పెన్షన్, కమ్యూటేషన్ లు చెల్లించి గ్రాట్యుటీ పెండింగ్ లో పెట్టారన్నారు. గతంలో ఈ పరిస్థితి ఎప్పుడూ లేదన్నారు.పదవీ విరమణ పొందిన తరువాత తమ ఆర్థిక ఇబ్బందులను వచ్చే ప్రయోజనాలతో తీర్చుకోవచ్చునని ఉద్యోగులు భావిస్తారని కానీ వారి ఆశలను నీరుగార్చడం తగదన్నారు. లీవ్ ఎన్కాష్మెంట్, డీఏ బకాయిలు గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు.వాటిని గురించి అడిగితే గత ప్రభుత్వం నుంచి ఉందని వారిపై నెపం నెట్టి వేస్తున్నారని, గ్రాట్యుటీ ఎందుకు చెల్లించలేదన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్నా నాలుగు పెండింగ్ డీఏలలో ఒకటి కూడా విడుదల చేయలేదన్నారు.మేము మరలా అధికారంలోకి వస్తే ఐ.ఆర్ తో నిమిత్తం లేకుండా 2024 జూలై నుంచి పిఆర్సీ ఇస్తామని చెప్పారన్నారు. ప్రస్తుతం ఉన్న పిఆర్సీ కమిటీని రద్దు చేసి పి.ఆర్.సీ కమిషనర్‌ను నియమిం చలేదన్నారు. వీటన్నింటిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని వెంటనే గ్రాట్యుటీని చెల్లించాలన్నారు.

# మహిళలకు ఉచిత బస్సు పథకంతో ఆటో డ్రైవర్లకు తీవ్రనష్టం

**- ఎఫ్.సి సేవలను మదనపల్లి ఆర్టీవో కార్యాలయంలో పునరుద్ధరించాలి**
**- సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆటో డ్రైవర్ల ధర్నా**




**మదనపల్లి –ఆంధ్రనాడు, ఆగష్టు 20:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆగష్ట్ 15 నుంచి మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం పథకం పేరుతో నష్టపోతున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఆదుకోవడానికి నేడు జరిగే మంత్రివర్గ సమావేశంలో ముందుకు తీసుకు రావాలని ఎన్నికల సందర్భంగా ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీ మేరకు వాహనమిత్ర పథకం అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ,ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ముబారక్,బిఎంఎస్ మదనపల్లి మండల కార్యదర్శి రెడ్డి బాషాలు డిమాండ్ చేశారు.ఆటో డ్రైవర్ల కటుంబాలను ఆదుకోవాలని కోరుతూ బుధవారం మదనపల్లి సబ్ - కలెక్టర్ కార్యాలయం వద్ద ఆటో వర్కర్స్ యూనియన్ల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదే రాష్ట్రంలోని అధికార కూటమి ప్రభుత్వం ఆగష్టు 15, 20225 నుండి రాష్ట్రంలోని మహిళలందరికి ఎక్కడ నుంచి ఎక్కడికైనా ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తోందని,దీనిని ఆటో వర్కర్స్ యూనియన్లుగా స్వాగతిస్తున్నామన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వం ఆటో డ్రైవర్లు మరియు మోటారు కార్మికుల విజ్ఞప్తిని పరిశీలించి ఆగష్టు 21న జరిగే మంత్రివర్గ సమావేశంలో అందరికి న్యాయం జరిగేలా ఆటో డ్రైవర్ల సమస్యలపై చర్చ జరపాలని కోరారు.చదువుకున్న లక్షలాది మంది యువకులకు ప్రభుత్వ ఉద్యోగాలు లేకపోవడంతో స్వయం ఉపాధిగా ఆటోలు,వ్యానులు,ట్యాక్సీలను ప్రైవేట్ ఫైనాన్స్ నుండి అప్పులు తీసుకుని మారుమూల గ్రామాల నుంచి పట్టణ ప్రాంతాలకు ప్రయాణీకులను చేరవేస్తూ ప్రభుత్వానికి కోట్లాది రూపాయులు పన్నులు చెల్లిస్తూ కంటి మీద కునుకు లేకుండా కుటుంబాలను పోషించు కుంటున్నారని తెలిపారు.2024 సంవత్సరం ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీల మేరకు ఆటో డ్రైవర్లు మోటరు కార్మికులకు వాహనమిత్ర క్రింద రూ.15 వేలు ఇస్తామని,జరిమానాలు పెంచే జీ.ఓ.నెం: 21,31ను రద్దు చేస్తామని,మోటారు రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని,కొత్త వాహనాలకు 5 శాతం వడ్డీతో బ్యాంకు రుణాలు మంజూరు చేస్తామని,ఉచితంగా చంద్రన్న ప్రమాధ భీమా రూ.10 లక్షలు అమలు చేస్తామని,పక్క రాష్ట్రాలకంటే పెట్రోల్,డీజల్ ధరలు తగ్గిస్తామని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క వాగ్దానం కూడా నెరవేర్చకుండా ఆటో డ్రైవర్ల కొట్టడం దుర్మార్గమన్నారు.ఆటోలకు ఎఫ్ సి సేవలు మదనపల్లి ఆర్టీవో కార్యాలయం కాకుండా రాయచోటిలో చేయడం మానుకోవాలని,మదనపల్లి ఆర్టీవో కార్యాలయంలోనే యదావిధిగా ఎఫ్ సి సేవలు కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేణు గోపాల్ రెడ్డి మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమల, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చంద్రశేఖర్ ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు దేవా,రెడ్డెప్ప,ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల విశ్వాసం కోల్పోయిన కూటమి ప్రభుత్వం

**- నిబంధనల పేరుతో సూపర్ సిక్స్ పథకాలలో కోత**
**- మదనపల్లి వైసీపీ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్**




**మదనపల్లి –ఆంధ్రనాడు, ఆగష్టు 20:** ఏపీలో కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందని మదనపల్లి నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ విమర్శించారు.బుధవారం పట్టణంలోని ఒకటో వార్డు నందు కౌన్సిలర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బాబు షూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నిస్సార్ అహమద్ తోపాటు మాజీ ఎమ్మెల్సీ, వైకాపా రాష్ట్ర కార్యదర్శి నరేష్ కుమార్ రెడ్డి, ఏపీఎండీసీ మాజీ చైర్ పర్సన్ షమీం అస్లాం, మున్సిపల్ చైర్ పర్సన్ వి.మనూజా కిరణ్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి,సంక్షేమాన్ని గాలికొదిలేసి, కక్ష్య సాధింపు చర్యలకు దిగుతోందన్నారు.ఎంపీ మిథున్ రెడ్డిని లిక్కర్ స్కాంలో అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టడమే ఇందుకు నిదర్శన మన్నారు. కూటమి నాయకులు దాడులు, దౌర్జన్యాలు అధికమైపోయాయని,శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించి పోయాయన్నారు.నిబంధనలపేరిట సూపర్ సిక్స్ పథకాలలో కోత విధిస్తోందని, ఇటీవల చాలామందికి దివ్యాం గులకు పింఛన్లను తొలగించారని విమర్శించారు. దీంతో వారు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తీవ్ర మనోవేదనకు గురవుతున్నారన్నారు.మాజీ ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో అర్హులందరికీ పారద ర్శకంగా సంక్షేమ పథకాలు అందజేయడం జరిగి ందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమ పాలనకు తూట్లు పొడుస్తూ ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రజాదరణ పెరుగుతోందని,మంగళవారం రాజంపేటకు విచ్చేసిన సందర్భంగా అనూహ్య రీతిలో ప్రజలు తరలివచ్చి జగనన్నపై తమ అభిమానాన్ని చాటుకున్నారన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా 2029లో జగన్మోహన్ రెడ్డి ఏపీకి మరో సారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు.అనంతరం ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న మోసపూరిత విధానాలను ప్రజలకు వివరించారు. అదేవిధంగా రింగు రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయంలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి త్వరగా బెయిల్ మంజూరు కావాలని 101 టెంకాయలు కొట్టి,ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అనంత మునిశేఖర్,నర్రీ బాబాయ్,శంకర్ రెడ్డి,సిద్దేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పింఛను చేరేవరకు నిరంతర పర్యవేక్షణ

**- పింఛను తొలగింపుపై అధికారులతో సమీక్ష నిర్వహించిన పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్**



**ఐరాల– ఆంధ్ర నాడు ఆగస్టు 20:** ఐరాల,పూతలపట్టు నియోజకవర్గంలో పెన్షన్ తొలగింపుపై పూతలపట్టు నియోజకవర్గం అధికారులతో పూతలపట్టు శాసన సభ్యులు మురళీమోహన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలోని పూతలపట్టు శాసనసభ్యులు కార్యాలయంలో పూతలపట్టు శాసనసభ్యులు.డాక్టర్ కలికిరి మురళీమోహన్ పీడీ మరియు నియోజకవర్గ ఎంపీడివోలతో సమావేశమై పెన్షన్ల తొలగింపు పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి పెన్షన్ తొలగిన వారి జాబితా అర్హత లేకున్నా పెన్షన్ పొందుతున్న వారిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పెన్షన్ అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజల హక్కుల విషయంలో అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని అధికారులను హెచ్చరించారు. పూతలపట్టు నియోజకవర్గంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పెన్షన్ చేరే వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తాను అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గం నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## వినాయక మండపాలకు నిబంధనలతో కూడిన అనుమతులు తప్పనిసరి


**- మదనపల్లి డీఎస్పీ మహేంద్ర**

**మదనపల్లి –ఆంధ్రనాడు, ఆగష్టు 20:** ఈనెల 27వ తేదీ వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వినాయక మండపాలను ఏర్పాటు చేసుకునేందుకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని మదనపల్లి డి.ఎస్.పి మహేంద్ర స్పష్టం చేశారు.బుధవారం మదనపల్లి సబ్ డివిజనల్ అధికారి కార్యాలయం నందు వన్ టౌన్ సీఐ పి.మహమ్మద్ రఫీ,టూ టౌన్ సీఐ రాజారెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ హిందువులకు పరమ పవిత్రమైన పర్వదినం వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, పోలీసు నిబంధనలకు లోబడే వేడుకలు నిర్వహించుకోవాలన్నారు.పట్టణంలో పలు వీధుల్లో వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసుకోవడం ఆనవాయితీ అని,అందుకు వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులు ఆయా స్టేషన్ల పరిధిలో అనుమతులను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.అదేవిధంగా ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని, లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేసి శబ్ద కాలుష్యం చేయరాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వినాయక మండపాలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కావున వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులకు సహకరించాలని సూచించారు.



## మణికుమార్‌కు ఘన సన్మానం

**- హాజరైన కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి**



**మదనపల్లి –ఆంధ్రనాడు, ఆగష్టు 20:** మదనపల్లి మండలం,కురవంక గ్రామ పంచాయతీ సెక్రటరీ సి.మణి కుమార్ బెస్ట్ పంచాయతీ సెక్రటరీ అవార్డు అందుకోవడం పట్ల నవ జీవన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 1వ వార్డు మెంబర్ మరియు సొసైటీ ప్రధాన కార్యదర్శి జి.కృష్ణ మూర్తి అభినందనలు తెలిపారు.బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయం నందు జి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ పసుపులేటి చలపతి హాజరయ్యారు.ఈ సందర్భంగా సర్పంచ్ చేతులు మీదుగా కృష్ణమూర్తితో కలసి సి.మణి కుమారుని శాలువా,పుష్ప గుచ్చం,పూలమాలతో సన్మానించి,నవజీవన్ వెల్ఫేర్ సొసైటీ జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ పసుపులేటి చలపతి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా కలెక్టరుచే పంచాయతీ కార్యదర్శి మణి కుమార్ విశిష్ట సేవలకిగాను బెస్ట్ పంచాయతీ కార్యదర్శిగా అవార్డు,ప్రసంసా పత్రం అందుకోవడం పట్ల అభినందనలు తెలిపారు.అలాగే పంచాయతీ పరిధిలో మరింత బాధ్యతా యుతంగా ప్రజలకు సేవలు అందించాలని కోరారు.పంచాయతీ 1వ వార్డు మెంబర్,నవ జీవన్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి గొంగడి కృష్ణమూర్తి మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ప్రజలకు బాధ్యతా యుతంగా సేవలు అందించి అవార్డు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.ఇలాగే ప్రజలకు చేరువలో వుంటూ ప్రజల ఆధరాభి మానాలను చురగొనాలని అకాంక్షించారు.సన్మాన గ్రహిత సి.మణి కుమార్ మాట్లా డుతూ తనకు నవజీవన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సర్పంచ్ ద్వారా సన్మానించి, శుభాకాంక్షలు తెలపడం తమ బాధ్యతలను మరింత పెంచిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యాలయం,సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## రాయితీ పథకాలపై అవగాహన




**తిరుపతి–ఆంధ్రనాడు, ఆగష్టు 20:** స్థానిక తిరుపతి నగరంలోని రేగాలియా హోటల్ లో ఎంఎస్ఎంఈ, చాంబర్ ఆఫ్ కామర్స్, తిరుపతి కోఆర్డినేటర్ వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న రాయితీ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డిస్టిక్ ఇండస్ట్రీ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ రామమూర్తి మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తద్వారా ఉపాధి పొందాలని సూచించారు. ఎం ఎస్ ఎం ఈ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ దాసరి దేవరాజు మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక యువత మన భారత దేశంలోనే ఉన్నారని, ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా తమకి ఆసక్తి కలిగిన రంగాన్ని ఎన్నుకొని ఉపాధిని కల్పించి ఉద్యోగాల కల్పన దిశగా పయనించాలని సూచించారు. అంతేకాకుండా నూతనంగా పరిశ్రమల స్థాపించిన వారికి తగిన వ్యాపార మెలకువలు,సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ డిహెచ్ఓ దొరసామిరెడ్డి ప్రెసిడెంట్ సురేంద్ర బండిల్లా, మునికృష్ణ ఎస్ఐడీబీఐ అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నగర పంచాయతీ ఏఈ రాజేందర్ బదిలీ

**- కమిషనర్ జీ.వి పల్లవి ఆధ్వర్యంలో ఘనసన్మానం**



**బి.కొత్తకోట– ఆంధ్రనాడు, ఆగష్టు 20:** బి.కొత్తకోట నగర పంచాయతీ ఏఈ రాజేందర్ హిందూపురం మున్సిపాలిటీ ఏఈగా బదిలీ అయ్యారు.ఈ నేపథ్యంలో బుధవారం నగర పంచాయతీ కమిషనర్ జీవీ పల్లవి,మేనేజర్ టి.రాములు ఆధ్వర్యంలో శాలువా,పూలమాలలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా కమిషనర్ పల్లవి మాట్లాడుతూ ఏఈ రాజేందర్ వృత్తి పట్ల ఎంతో నిబద్ధతతో పనిచేసేవారన్నారు.తోటి అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేసి నగర పంచాయతీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు.ఇక్కడ నుండి ఆయన బదిలీ అవడం కొంత ఇబ్బందికరమే అయినప్పటికీ,ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు సర్వసాధారణమేనన్నారు.ఆయనకు భవిష్యత్తులో మరిన్ని పదోన్నతులు లభించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నగరపంచాయతీ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుడి మండపాలకు అనుమతులు తీసుకోవాలి



**పెద్దపంజాణి - ఆంధ్రనాడు, ఆగస్టు 20:** ఈ నెల 27 న రానున్న వినాయక చవితి పండుగ సందర్భంగా మండలంలో వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేసే వారందరూ పోలీస్ స్టేషన్లో ముందస్తు సమాచారం అందించి తప్పకుండా అనుమతి తీసుకోవాలని ఎస్ఐ ధనంజయరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని రాజుపల్లిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామాల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేసే ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్ శాఖ నుండి అనుమతి తీసుకోవాలని తెలియజేశారు. అలాగే గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనితీరును పరిశీలించారు.

## అభివృద్ధి పనులను త్వరగా పూర్తిగా పనిచేయాలి




**చంద్రగిరి - ఆంధ్రనాడు, ఆగస్టు 20:** చంద్రగిరిలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. చంద్రగిరి మండలంలో జరుగుతున్న పనులను ఎమ్మెల్యే నాని మండల అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. మండల పరిషత్ నూతన కార్యాలయ నిర్మాణంలో భాగమైన రెండవ అంతస్తు స్లాబ్ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. చంద్రగిరి పట్టణానికి విచ్చేసిన ఎమ్మెల్యేకి మండల స్థాయి అధికారులు, కూటమి ప్రభుత్వం నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత రెండు నెలల క్రితం సుమారు 3 కోట్ల రూపాయలతో నూతన ఎంపీడీవో కార్యాలయాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. అనంతరం గోవిందధామంలో జరుగుతున్న పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. అందరి సహకారం తీసుకొని పనులు వేగవంతం చేయాలని కమిటీ సభ్యులను కోరారు. ఇప్పటికే దాతలు గోవింద ధామంకు సుమారు 50 లక్షల వరకు డబ్బులు విరాళంగా ప్రకటించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు కాంట్రాక్టర్, కూటమి ప్రభుత్వం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య వేడుకల్లో కేజీబీవీ విద్యార్థినులకు బెస్ట్ అవార్డు



**కేవీబీపురం - ఆంధ్రనాడు, ఆగస్టు 20:** 79 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా తిరుపతిలో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన పెరడ్‌లో కేవీబీపురం మండలంలోని కస్తూరిబా గాంధీ విద్యార్థులు ప్రతిభ కనబరచి అందరి ప్రశంసలు పొంది బెస్ట్ అవార్డు అందుకున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ సుకన్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తిరుపతిలోని ఎన్టీఆర్ గ్రౌండ్స్ లో జరిగిన 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు 33 మంది పెరడ్లో పాల్గొని క్రమశిక్షణ, సమన్వయం, దేశభక్తితో కూడిన ప్రదర్శన ఇచ్చి వేదికను ఆకట్టుకున్నారని తెలిపారు.వారి కృషి, ప్రతిభను గుర్తించిన రాష్ట్ర మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరరావు, ఎస్పీ కలిసి పిల్లలకు బెస్ట్ కంటైనర్స్ అవార్డు ను అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఇంతటి ప్రతిభను కనపరచడానికి చొరవ చూపిన వ్యాయామ ఉపాధ్యాయు రాలును, విద్యార్థులను మండల ప్రజలు ప్రసంశించారు.

## శ్రీ పల్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో ప్రదోష పూజలు



**నాగలాపురం - ఆంధ్రనాడు, ఆగస్టు 20:** నాగలాపురం మండలం సురుటుపల్లి గ్రామంలో వెలిసి ఉన్న శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పల్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం ప్రదోష పూజలు నిర్వహించారు. ఈ ప్రదోషం సందర్భంగా శ్రీ నందీశ్వర స్వామికి, శ్రీ వాల్మీకేశ్వర స్వామి వారికి ఏకకాలంలో ప్రదోష పూజలు నిర్వహించారు. అభిషేకం అనంతరం స్వామి అమ్మవార్లను, ప్రదోష నందీశ్వర స్వామిని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి ధూప దీప నైవేద్యములు, మహాదీపారాధనలు నిర్వహించారు. ఈ ప్రదోష పూజలకు ప్రసాదం ఉభయదారులుగా నింద్రకు చెందిన శ్రీనివాస్ మిల్క్ ప్రైవేట్ లిమిటెడ్ ఉభయ దారులుగా వ్యవహారించారు. వారికి ఆలయ కార్యనిర్వహణాధికారిణి పి. లత ఆలయ మర్యాదలతో దర్శనం ఏర్పాట్లు చేసి స్వామి వారి ప్రసాదములు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# చంద్రగిరి అభివృద్ధికి మరో ముందడుగు



**చంద్రగిరి - ఆంధ్రనాడు, ఆగస్టు 20:** చంద్రగిరిలో అభివృద్ధికి అవసరమయ్యే పనులను గుర్తించటానికి ఎమ్మెల్యే పులివర్తి నాని అది కాదు తో కలిసి మరో ముందడుగు వేశారు. ఇందులో భాగంగా చంద్రగిరి పట్టణంలో అధికారులతో కలిసి బీసీ, ఎస్సీ వసతి గృహాలకు స్థలం పరిశీలించారు. బాలికల హాస్టల్ వద్ద శుభ్రత లేకపోవడంతో సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేసారు. తక్షణమే శుభ్రం చేయించి, బ్లీచింగ్ వేయాలని హాస్టల్ వార్డెన్లను ఎమ్మెల్యే ఆదేశించారు. చంద్రగిరి పట్టణంలో ఆక్రమనకు గురైన ప్రభుత్వ స్థలాలను, కాలవలను గుర్తించాలని మండల రెవిన్యూ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేసారు. చంద్రగిరి బాలుర పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం పనులను పరిశీంచారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ని కోరారు.చంద్రగిరి పట్టణంలోని మండల తాశీల్దార్ కార్యాలయంలో అసంపూర్తిగా నిలిచిన భవనాన్ని పరిశీలించారు. అనంతరం చంద్రగిరి రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గతంలో మండల ప్రజలు ఇచ్చిన అర్జీలను, ప్రజా సమస్య పరిష్కార వేదికలో ఇచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. చంద్రగిరిని సమస్యలు లేని మండలంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో తాసిల్దారు శివరామమూర్తి ఎంపీడీవో వెంకటేశ్వర్లు స్థానిక నాయకులు రమేష్ రెడ్డి, పల్లి నేని సుబ్రమణ్యం నాయుడు, గౌస్ బాషా ఏజిపల్లి బాల, సక్కూరు ధనంజయ రెడ్డి, తులసీశ్వర్ రెడ్డి, మోహన్ రెడ్డి, ప్రవీణ్ రాయల్, నాగరాజ నాయుడు, సర్పంచ్ రూప రామమూర్తి మాజీ జడ్పిటిసి అమ్ములు మండల మహిళా అధ్యక్షురాలు కొత్తపల్లి సునీత, పెద్ద ఎత్తున కార్యకర్తలు, మహిళలు నాయకులు పాల్గొన్నారు.

# రికార్డులు అందించి ఆడిటింట్ పూర్తి చేసుకోవాలి



**సత్యవేడు - ఆంధ్రనాడు, ఆగస్టు 20:** ఆడిటింగ్ అధికార బృందానికి పంచాయతీ ఆదాయ వ్యయాలకు సంబంధించి రికార్డులు, బిల్లులను సమర్పించి ఆడిటింగ్ పూర్తి చేసుకోవాలని సత్యవేడు ఇంచార్జ్ ఎంపీడీవో త్రివిక్రమరావు కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆడిటింగ్ అధికారుల బృందంతో కలిసి ఆయన ఆడిటింగ్ పై పంచాయతీ కార్యదర్శిలకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో త్రివిక్రమరావు మాట్లాడుతూ 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆడిటింగ్ జరుగుతుందనీ, ప్రతి పంచాయతీకి వివిధ పద్దుల కింద ప్రభుత్వం మంజూరు చేసిన నిధులకు సంబంధించిన ఆదాయ, వ్యయాలను ఆడిటింగ్ అధికార బృందం పరిశీలన జరుగుతుందన్నారు. అందువల్ల ప్రతి పంచాయతీ కార్యదర్శి సంబంధించిన రికార్డులు, బిల్లులను సమర్పించి ఆడిటింగ్ పూర్తి చేసుకోవాలన్నారు. ఇంతకు మునుపు పని చేసిన పంచాయతీ కార్యదర్శి నుంచి ఇందుకు సంబంధించిన బిల్లులను సేకరించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆడిటింగ్ పూర్తవడానికి సహకరించాలన్నారు. కాగా మండల పరిషత్ నిధుల ఆదాయ, వ్యయాల సంబంధించిన ఆడిటింగ్తో పాటు 28 పంచాయతీల ఆడిటింగ్ నిర్వహించడానికి ఆడిటింగ్ బృందం సమాయత్త మయ్యారు. ఈ నేపథ్యంలో జిల్లా అసిస్టెంట్ ఆడిటింగ్ అధికారి రామకృష్ణంరాజు, సీనియర్ ఆడిటర్లు సాయిశంకర్ అయ్యప్ప, పార్వతి తదితరుల బృందం బుధవారం నుంచే ఆడిటింగ్ ప్రారంభమయ్యాయి. ఈ సమావేశంలో మండలంలోని పలు పంచాయతీల పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

# శ్రీసిటీని సందర్శించిన జపాన్ ప్రతినిధుల బృందం



**శ్రీసిటీ - ఆంధ్రనాడు, ఆగస్టు 20:** ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ జనరల్ మేనేజర్ తకాహిరో ఇన్నామి నేతృత్వంలో జపాన్‌లోని ఎహైమ్ రాష్ట్రానికి చెందిన నలుగురు సభ్యుల వ్యాపార ప్రతినిధి బృందం బుధవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (బిజినెస్ డెవలప్‌మెంట్) బోడ్గన్ జార్జ్ ప్రతినిధి బృందానికి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రపంచశ్రేణి మౌలిక సదుపాయాలు, రంగాలవారీ వైవిధ్యం, సుస్థిర ప్రణాళిక, వ్యాపార అనుకూలతలను వారికి వివరించారు. ఆంధ్రప్రదేశ్ పెట్టుబడిదారుల అనుకూల విధానాలను హైలైట్ చేస్తూ వేగవంతమైన అనుమతులు, రంగాలవారి నిర్దిష్ట ప్రోత్సాహకాలు, 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' తదితర అంశాల గురించి వెల్లడించారు. ఈ పర్యటనపై స్పందించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్.రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఎహైమ్ రాష్ట్ర పారిశ్రామికవేత్తలను సాదరంగా ఆహ్వానించారు. ఎహైమ్‌కు చెందిన వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల తయారీ పరిశ్రమ యూనిచార్మ్ సహా 35 కు పైగా జపాన్ కంపెనీల ఏర్పాటుతో దేశంలో రెండవ అతిపెద్ద జపనీస్ పరిశ్రమల కేంద్రంగా శ్రీసిటీ అవతరించిందని పేర్కొన్నారు. శ్రీసిటీ వ్యాపారాను కూల వాతావరణం, జపనీస్ సంస్థలతో భాగస్వామ్యాన్ని ఇన్నామి ప్రశంసించారు. భారతదేశంలో ఎలక్ట్రిక్ ఆటో-రిక్షాలకు వున్న మార్కెట్ డిమాండ్ దృష్ట్యా, భారత్‌లో కాలుష్యరహిత పర్యావరణ వ్యవస్థకు దోహదపడే రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిని వ్యక్తం చేసింది. ఈ ఏడాదిలో రెండవ పర్యాయం ఎహైమ్ వ్యాపారవేత్తల బృందం శ్రీసిటీ పర్యటనకు రావడం శ్రీసిటీలో వ్యాపార నిర్వహణ పట్ల జపాన్ సంస్థల ఆసక్తిని తెలియచేయడంతో పాటు ఇండో - జపనీస్ ఆర్థిక సహకారాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

## ప్రపంచ దోమల దినోత్సవం

**- ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ**



**తిరుపతి కలెక్టరేట్ - ఆంధ్రనాడు, ఆగస్టు 20:** ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. శైలజ లాటో అధ్యక్షతన, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ జి.కే. రూప్‌కుమార్ నేతృత్వంలో డిఎంహెచ్ఓ కార్యాలయం నుండి ర్యాలీ ప్రారంభమైంది. ర్యాలీ రామకృష్ణ సర్కిల్ మీదుగా సాగి, దోమల నిర్మూలన ఆరోగ్య రక్షణ అనే నినాదాలతో కొనసాగింది. అనంతరం డిఎంహెచ్ఓ కార్యాలయ ప్రాంగణంలో మానవహారం రూపకల్పన చేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శైలజ లాటో మాట్లాడుతూ... ఆరోగ్య భద్రత అనే సంకల్పంతో దోమలు లేని గ్రామాలు, దోమలు లేని నగరాల నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో అందరి భాగస్వామ్యం అవసరమని అన్నారు. తరువాత దోమల నిర్మూలనలో భాగస్వామ్యం కావాలని ప్రతిజ్ఞగా చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి (డీసీఎస్), డాక్టర్ మురళీకృష్ణ (డీఎస్ఓ), డాక్టర్ రెడ్డి ప్రసాదు (పీఓ), డాక్టర్ మధు, ఇతర వైద్యాధికారులు, డిప్యూటీ డెమో, డిఎంహెచ్ఓ సిబ్బంది, ఎస్‌యు ఓలు, ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్లను తనిఖీ చేసిన రైల్వే జీఎం




**రేణిగుంట - ఆంధ్రనాడు, ఆగస్టు 20:** సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ వాస్తవ్, గుంటకల్ డివిజన్ డివిజనల్ మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా రేణిగుంట తిరుపతి రైల్వే స్టేషన్లను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేణిగుంట రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ బ్రాంచ్ తరపున జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ వాస్తవ్‌ని సన్మానించి పెన్షనర్ల సమస్యలపై వినతిపత్రం ఇవ్వడం జరిగింది.పెన్షనర్ల సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని, పెన్షనర్ల కు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వెల్ఫేర్ ఇన్స్పెక్టర్లు తరచుగా పెన్షన్ల సమస్యలను గురించి వారితో చర్చించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సమస్యల వినతి పత్రంలో కోరడమైనది. జనరల్ మేనేజర్ వినతిపత్రాన్ని పరిశీలించి తగుచర్యలు తీసుకుంటామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే మెన్స్ ఫెడరేషన్ గుంతకల్ డివిజనల్ ప్రెసిడెంట్ డాక్టర్ గుమ్మడి జయంత్ కుమార్, రేణిగుంట బ్రాంచ్ చైర్మన్ అసన్ సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

# టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

**రేణిగుంట – ఆంధ్రనాడు, ఆగస్టు 20:** అమరావతి కేంద్రంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభించడంతో పాటు వర్చువల్‌గా తిరుపతి, విశాఖ, రాజమహేంద్రవరం, విజయవాడ, అనంతపురము లలో ఏర్పాటు చేసిన ఐదు స్పోక్స్ కేంద్రాలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. బుధవారం ఉదయం రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీస్‌లో ఏర్పాటు చేసిన తిరుపతి, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ స్పోక్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్లు ఆచార్య అప్పారావు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశిలతో కలిసి శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి రిబ్బన్ కట్‌చేసి, జ్యోతి ప్రజ్వలన అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంగళగిరిలోని మయూరి టెక్ పార్క్ ప్రాంగణంలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ముఖ్య ఆహ్వానితులు తిలకించారు. అనంతరం ఐదు స్పోక్స్ కేంద్రాలలో కార్యక్రమానికి హాజరైన వారు ఆవిష్కరణ ఆంధ్ర ప్రతిజ్ఞను చేశారు. ఈ సందర్భంగా మీడియాతో శ్రీ కాళహస్తి ఎం.ఎల్.ఏ బొజ్జల వెంకట సుదీర్ రెడ్డి మాట్లాడుతూ నేడు ఎన్.డి ఏ ప్రభుత్వం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఇది యువ పారిశ్రామికులు, తమ స్వంత స్టార్టప్ వ్యాపారం మొదలు పెట్టాలనుకునే వారికి అద్భుతమైన అవకాశమన్నారు. ఎవరైనా మంచి ఆలోచనలు కలిగి, ఉత్సాహం ఉన్న వారు ఒక మార్గదర్శకత కోసం, మంచి కారణం కోసం వేచి చూస్తున్న వారి కోసం ఈ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ గొప్ప అవకాశంగా మారుతుందన్నారు. గడిచిన 24 గంటల్లో 1,60,000 మంది యువకులు తమ కంపెనీలు స్టార్ట్ చేసేందుకు రిజిస్టర్ చేసుకున్నారన్నారు. ఇది ఆంధ్రప్రదేశ్‌లో కొత్త వరల్డ్ రికార్డ్ గా మారిందన్నారు. తాను చంద్రబాబు గురించి వినగానే తనకు ఒక ఆలోచన వచ్చిందని, కష్టపడి చదివి ఏదో ఒకటి అవ్వాలని కోరుకునే ప్రతి యువతీ యువకులకు ఇది మంచి అవకాశం అన్నారు. ఈ హబ్ ద్వారా రతన్ టాటా ఎప్పటికీ అందరి మదిలో చిరస్థాయిగా నిలచిపోతారన్నారు. నేడు ఒకేసారి ఐదు చోట్ల రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ స్పోక్స్ కేంద్రాలను మొదలు పెట్టారన్నారు. ఆ ఐదింటిలో ఒకటి తిరుపతి కావడం తనకు చాలా గర్వకారణంగా ఉందన్నారు. అలాగే, ప్రతి ఎంట్రప్రెన్యూర్‌కి కూడా ఒక లక్ష్యం ఉంటుందన్నారు. విజన్ 2020 అని ముఖ్యమంత్రి అన్నప్పుడు అందరు నవ్వుకున్నారని, అది సాకారం అయ్యాక ముఖ్య మంత్రి ముందు చూపు ఏమిటో అందరికి తెలిసిందని,






అదే క్రమంలో నేడు విజన్ – 2047 ను మన ముందుకు తెచ్చారన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి దూరదృష్టి ఉన్న నాయకుడన్నారు. ఆయన ఎప్పుడూ యువ వ్యాపారులను సరైన దారిలో నడిపే వ్యక్తిగా ముందుంటారన్నారు. జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ మాట్లాడుతూ నేడు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, స్పోక్స్ కేంద్రాన్ని రాష్ట్ర ముఖ్య మంత్రి ప్రారంభించారన్నారు. ఇది ఇన్నోవేషన్, ఇన్క్యుబేషన్ కోసం హబ్ అండ్ స్పోక్ మోడల్. హబ్ అమరావతిలో ఉంటుందని, రాష్ట్రంలో విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, అనంతపురం, తిరుపతిలలో ఐదు స్పోక్స్ కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. ప్రతి స్పోక్ కేంద్రంలో ఒక లీడ్ పార్ట్నర్ ఉంటారని, తిరుపతికి అదాని లీడ్ పార్ట్నర్ అన్నారు. వారితో పాటు మరో రెండు కంపెనీలైన నవయుగ, అమర్ రాజా లు కూడా లీడ్ పార్ట్నర్ లుగా, ఇవి కాకుండా నాలెడ్జ్ పార్ట్నర్ గా ఐ.ఐ.టిఉందన్నారు. ఇది ప్రభుత్వ, కార్పొరేట్ మరియు అండ్ అకడమిక్ రంగాల సమ్మేళనమన్నారు. అందరం కలిస్తేనే ఇన్నోవేషన్ సాధ్యం అని, ఒక్క సెక్టార్ మాత్రమే కాదు, మనమందరం కలిసి పనిచేస్తేనే కొత్త ఆలోచనలు వెలువడతాయన్నారు. దేశంలోనే తొలిసారిగా ఒక వినూత్నమైన మోడల్ ను రాష్ట్ర ముఖ్య మంత్రి ప్రారంబిస్తూ దేశంలోనే జాతీయ సంపన్నుడు గా పేరుగాంచిన రతన్ టాటా పేరుతో ఈ హబ్ ను ప్రారంభించారన్నారు. టాటా సన్స్ ప్రధాన భాగస్వామి గా, పెద్ద పరిశ్రమలు జ్ఞాన భాగస్వాములుగా ఉన్నారన్నారు. తిరుపతి జ్ఞాన నగరం అని ఇక్కడ ఐ.ఐ.టి, ఐసర్, మహిళా విశ్వవిద్యాలయం, ఎస్.వి విశ్వవిద్యాలయం, వెటర్నరీ విశ్వవిద్యాలయం, ట్రిబుల్ ఐటీ, క్రియా విశ్వవిద్యాలయం, మోహన్ బాబు యూనివర్సిటీ, అగ్రికల్చర్ యూనివర్సిటీ, సంస్కృత యూనివర్సిటీ ఇలా 14 జాతీయ, రాష్ట్ర యూనివర్సిటీ లున్నాయన్నారు. ఒకవైపు అకడమిక్ యూనివర్సిటీలున్నా, ఇంకో వైపు ఇండస్ట్రీ పరంగా చూస్తే శ్రీసిటీ, నాయుడుపేట పార్క్ లాంటివి అద్భుతమైన ఇండస్ట్రియల్ పార్కులు ఉన్నాయన్నారు. రౌత్ సురమాల వస్తున్నదని అలాగే కృష్ణపట్నం పోర్టు వద్ద క్రిస్ సిటీ ఉందని, ఇక్కడ ఒక ఎలక్ట్రానిక్ తయారీ క్లస్టర్ 1, 2 ఉన్నాయన్నారు. ఇలా చూస్తే, మంచి ఇండస్ట్రీ వాతావరణం ఉందని. నిజానికి, మన జిల్లా జిడిపి లో కూడా 45% ఇండస్ట్రీ నుండి వస్తుందన్నారు. ఎవ్వరికైనా ఎంట్రప్రెన్యూర్ అవ్వడానికి గొప్ప అవకాశం ఉందిని, ముఖ్య మంత్రి ఇచ్చిన పిలుపు మేరకు ఒక్క కుటుంబానికి ఒక ఎంట్రప్రెన్యూర్ రావాలని, ప్రతి కుటుంబంలో ఒక ఎంట్రప్రెన్యూర్ తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు. 30 ఏళ్ల క్రితం, ఆయన ప్రతి ఇంట్లో ఒకరు ఐటీ రంగంలో ఉండాలని పిలిచారని ఇప్పుడు, దాదాపు ప్రతి ఇంట్లో ఒకరు ఐటీ రంగంలో ఉన్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ నుండి చాలా మంది విదేశాల్లో కూడా స్థిరపడ్డారన్నారు. వారి ద్వారా సంపద కూడా ఏర్పడిందన్నారు. 2047 కి ప్రతి ఇంట్లో ఒక వ్యాపారవేత్త ఉండాలన్నదే ప్రధాన లక్ష్యం అన్నారు. ఇది మంచి, ప్రత్యేకమైన, క్రియేటివ్ మోడల్ అని పరిశ్రమ భాగస్వాములన్నింటి సహకారంతో ఈ కేంద్రాలను ముఖ్యమంత్రి రూపొందించారన్నారు. యాజమాన్యాలు స్కిల్ డెవలప్‌మెంట్ చేయొచ్చు, ఉద్యోగాలు సృష్టించొచ్చు, అవసరమైన ప్రతిదీ ఈ స్పోక్స్‌లో ఉందన్నారు. తిరుపతి జిల్లాతో పాటు చిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాలకు చెందినవారు ఈ కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ మీడియా ద్వారా పిలుపునిచ్చారు. అనంతరం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ స్పోక్ కేంద్ర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మత్స్య శాఖ, సెన్సార్ సింక్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్, కేతన టెక్ బీస్, ఆటో కంపోసైట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫోక్స్ లింక్, కార్బన్ సెల్స్, మనోడ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, పైపర్ పిక్సెల్ రోబోటిక్ ప్రైవేట్ లిమిటెడ్, మైండ్ ట్రానిక్స్ జుమాంజి బాక్స్, రోబో మాక్ ఎన్జీఈఎన్ వాటర్ సొల్యూషన్స్, కోకో మంత్రా, ఎనర్జీ ఎఫిషియన్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఫ్రెండ్లీ ఫోరం, ఏఈ డిఏపి ఎక్విప్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, పల్పియో జ్యూస్ సంస్థల స్టాల్స్‌లను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్ ట్రైనీ కలెక్టర్ తదితరులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్, ప్రజాప్రతినిధులు, ఆయా పరిశ్రమల యాజమాన్యాలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దోమల నివారణతో అంటు వ్యాధులు దూరం

**చంద్రగిరి – ఆంధ్రనాడు, ఆగస్టు 20:** దోమల నివారణతో అంటువ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చునని గ్రామీణ ఆరోగ్య శిక్షణ కేంద్రం ఆరోగ్య అధికారి డాక్టర్ యుగంధర్ అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామీణ ఆరోగ్య శిక్షణ కేంద్రంలో యుగంధర్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ అనాఫిలిస్ దోమ కాటు వలన మలేరియా జ్వరము వ్యాపిస్తుందని సర్ రోనాల్డ్ రాస్ కనుగొన్న దినాన్ని ప్రపంచ దోమల దినోత్సవం గా జరుపుకుంటామని చెప్పారు. దోమ కాటు వలన డెంగ్యూ, చికెన్ గునియా, ఫైలేరియా మెదడువాపు వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయని వివరించారు. ప్రజలు దోమల అభివృద్ధిని అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంటి పరిసరాలలో నీటి నిలువలు లేకుండా ఉంచుకోవాలని, శుక్రవారం డ్రై డే గా పాటించాలని, పాత వస్తువులు టైర్లు కొబ్బరి చిప్పలు డ్రమ్ములు ఇవన్నీ కూడా ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలని తెలియజేశారు. జ్వరము వచ్చినట్లయితే ప్రజలు రెండు





రోజులు సాధారణ మందులు వాడి తగ్గనట్లయితే దగ్గరలో ఉన్న ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్, డాక్టర్ సౌమ్య ప్రియ, డాక్టర్ రేవతి, డిప్యూటీ డెమో కిరణ్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎం.టాటాబాయి, సబ్ యూనిట్ ఆఫీసర్ శివయ్య, సూపర్వైజర్లు ప్రమీల, తులసీరామ్, ఏఎన్ఎంలు గిరిజ, శశిరేఖ, సుబ్బలక్ష్మి, జూనియర్ డాక్టర్లు ప్రజలు పాల్గొన్నారు.

## తవణంపల్లిలో ప్రపంచ దోమల దినోత్సవం



**తవణంపల్లి – ఆంధ్రనాడు, ఆగస్టు 20:** చిత్తూరు జిల్లా తవణంపల్లి మండల వైద్య అధికారి డాక్టర్ టి.ప్రియాంక ఆదేశానుసారం మండల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ జ్ఞాన శేఖర్, రాజామణి ఆధ్వర్యంలో తవణంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది మండల కేంద్రంలోని పుర వీధులలో ప్రపంచ దోమల దినోత్సవం కార్యక్రమంలో బాగంగా ర్యాలీ, మానవహారం నిర్వహించారు. దోమతెరలు వాడండి ఆరోగ్యంగా ఉండండి, వేపాకు పొగ దోమలకు సెగ, దోమకాటు ఆరోగ్యానికి చేటు, నిలువ నీళ్లు దోమలకు ఇల్లు, దోమ కాటు డెంగ్యూ వ్యాధి, మలేరియా వ్యాధికి చోటు, ఇంట్లో దోమల మోత మనకు జ్వరాలు వాత, దోమ చిన్నది ప్రమాదం పెద్దది, మలేరియా అంతం మన అందరి పంతం, ఫ్రైడే ఫ్రైడే పాడేద్దాం, దోమలు పుట్టకూడదు దోమలు పుట్టకూడదు, దోమతెర కట్టుకో దోమలు కుట్టకుండా చూసుకో అంటూ వైద్య సిబ్బందితో దోమల నిర్మూలనకు సంబంధించి కొన్ని స్లొగన్స్ తో ర్యాలీ నిర్వహించి దోమల పెరుగుదలను అరికట్టడానికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయడమైనది. ఈ కార్యక్రమంలో పి.హెచ్.ఎన్ జీవకళ ఆరోగ్య పర్యవేక్షకులు గోపి, రెడ్డమ్మ, నిర్మలమ్మ ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యంరెడ్డి, శ్రీనివాసులు, ఏం.ఎల్.హెచ్.పిలు, ఏ.ఎన్.ఏంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థి




**తంబళ్లపల్లి – ఆంధ్రనాడు, ఆగస్టు 20:** తంబళ్లపల్లి మోడల్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి మహమ్మద్ అజహర్ జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్టు పీడీ లత, ప్రిన్సిపాల్ హేమంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఏపీ షూటింగ్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ పరశురాముడు, జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కన్వీనర్ సురేష్ బాబు, కార్యదర్శి గౌతమి నుంచి ఎంపిక ఉత్తర్వులు వచ్చినట్టు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ నెల 25,26 తేదీలలో మదనపల్లిలోని వశిష్ఠ స్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలలో విద్యార్థి అజహర్ అన్నమయ్య జిల్లా జట్టు తరపున పాల్గొని ప్రతిభ చూపాడన్నారు. దీంతో సెలెక్టర్లు అజహర్ ను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు వారు చెప్పారు. బీహార్ లోని బుద్ధ గయాలో జరిగే 44 వ జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో అజహర్ పాల్గొంటాడని పాఠశాల ప్రిన్సిపాల్ అజహర్, పిజికల్ డైరెక్టర్ లత తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన అజహర్‌ను ఎంఈఓలు త్యాగరాజు, నాగ సుబ్బారాయుడు, ప్రిన్సిపాల్, పీడీ, ఎస్ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు, నాయకులు, గ్రామస్తులు అభినందించారు.

## కరకంబాడిలో పోలీసుల పల్లె నిద్ర



**రేణిగుంట – ఆంధ్రనాడు, ఆగస్టు 20:** రేణిగుంట మండలం కరకంబాడి గ్రామంలో మంగళవారం రాత్రి పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జయచంద్ర పాల్గొని గ్రామస్తులకు పలుచట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కంప్యూటర్ల వితరణ




**సత్యవేడు – ఆంధ్రనాడు, ఆగస్టు 20:** సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.వెంకటరమి రెడ్డి విద్యార్థులలో కంప్యూటర్ పై పరిజ్ఞానం కొరకు భవిష్యత్తును ఆలోచించి చిత్తూరు జిల్లా వి.కోట అమ్మ సిటిఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్.దశరథరెడ్డినీ కలసి విషయము తెలియజేశారు. వెంటనే స్పందించి ఐదు కంప్యూటర్లు, ఒక ప్రింటర్‌ను కళాశాల అధ్యాపకులు రాజేష్ కుమార్, శివరాం లకు స్వయంగా అందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు అమ్మ సిటిఎస్ ఫౌండేషన్కు కృతజ్ఞతలు తెలిపారు.

## అన్నాసంపల్లె ఉన్నత పాఠశాలకు ఫర్నిచర్ పంపిణీ




**రేణిగుంట – ఆంధ్రనాడు, ఆగస్టు 20:** రేణిగుంట మండలంలోని వెంకటాపురం పంచాయతీ అన్నా స్వామి పల్లి జడ్పీ ఉన్నత పాఠశాల కు బుధవారం తిరుపతి ఐడిబిఐ బ్యాంక్ తరపున రూ.70000 విలువచేసే ఫర్నిచర్‌ను ఏజీఎం శ్యాంప్రసాద్, బ్రాంచ్ హెడ్ రమేష్, మేనేజర్ బి.వి శరత్ ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రీజనల్ హెడ్ సాయి కృష్ణ ఆదేశాల మేరకు సిఎస్ఆర్ నిధులలో పాఠశాలకు తమ వంతు సహాయంగా ఈ కార్యక్రమం నిర్వహించామని అన్నారు.పాఠశాల కో ఆప్షన్ సభ్యులు జూలియన్ రాజు మాట్లాడుతూ తన మాటకు గౌరవం ఇచ్చి పాఠశాలకు సహాయం చేసిన బ్యాంక్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం అనంతరం బ్యాంకు ఉద్యోగులను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శోభ రాణి, శశికళ, మునిమనోహర్, యాగయ్య, నాగమ్మ, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

## నలగాంపల్లి సబ్ స్టేషన్‌లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్స్ ప్రారంభం



**బంగారుపాళ్యం – ఆంధ్రనాడు, ఆగస్టు 20:** చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం నలగాంపల్లి పంచాయతీ లూకాస్ పురం పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న సబ్ స్టేషన్ లో అదనపు ట్రాన్స్ఫర్ ను చిత్తూరు విద్యుత్ ఎస్ఇ ఇస్మాయిల్ అహ్మద్ విద్యుత్ సిబ్బందితో కలిసి బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ ఇ ఇస్మాయిల్ అహ్మద్ మాట్లాడుతూ నల్లగాంపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు నలగాంపల్లి, తుమ్మోజిపల్లి, బోమ్మాయిపల్లి, కరిడివారిపల్లి, మామిడి పరిశ్రమలకు మెరుగైన విద్యుత్తును అందించేందుకు అదనపు ట్రాన్స్ఫర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మునిచంద్ర, ఈఈ టి ఆర్ ఇ బాబు, బంగారుపాళ్యం ఏఈ దేవి ప్రసన్న, టి ఆర్ ఈ ఏ ఈ హేమచంద్ర, ప్రొటెక్షన్ ఏఈ సోమరాజు, ఎల్ఐ రవి, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## డిజిటల్ నర్వ్ సెంటర్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**కుప్పం - ఆంధ్రనాడు, ఆగస్టు 20:** కుప్పం ఏరియా ఆసుపత్రిలోని డిజిటల్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పరిశీలించారు. రాష్ట్రంలో తొలిసారిగా కుప్పంలో డిజిటల్ నర్వ్ సెంటర్ పనితీరును జిల్లా కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... సాంకేతికత వినియోగించడంతో వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స తీసుకోవచ్చున్నారు. తద్వారా ప్రభుత్వం ప్రజలపై ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. ఈ కేంద్రం ద్వారా కుప్పం నియోజకవర్గ పరిధిలోని 13 పీ.హెచ్.సిలు, 92 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను అనుసంధానం చేయడం జరిగిందని తెలిపారు. వ్యక్తిగత వైద్య రికార్డుల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉండేలా ఈ కేంద్రం సేవలందించ నుందని రోగుల కన్సల్టెన్సీ సేవలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. డిజిటల్ నర్వ్ సెంటర్ నందు జిల్లా కలెక్టర్ హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, ఎంతమంది పేషెంట్లు వస్తున్నారని, డాక్టర్లు ఏ సమయానికి వస్తున్నారు. ఎప్పుడు వెళ్తున్నారో అని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు అందు బాటులో ఉండి సెలవు రోజుల్లో కూడా హాజరుకావాలని, సెలవు రోజు హాజరైన డాక్టర్‌కి ప్రత్యాయంగా ఇంకో రోజు సెలవు తీసుకోవచ్చని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## వినాయక ఉత్సవాలకు అంతర్జాలంలో దరఖాస్తు చేసుకోవాలి




**చౌడేపల్లి - ఆంధ్రనాడు, ఆగస్టు 20:** వినాయక ఉత్సవాలకు అనుమతుల కోసం అంతర్జాలంలో దరఖాస్తు చేసుకోవాలని ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన మాట్లాడుతూ. మండపాల నిర్వాహకులు వెబ్సైటును ఉపయోగించి సింగల్ విండో విధానంలో ఆన్లైన్లో అనుమతులు పొందవచ్చు నన్నారు. అనుమతులు పొందడానికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. అంతర్జాలంలో దరఖాస్తు చేసుకున్న తర్వాత సంబంధిత పోలీస్ అధికారి మండప స్థలాన్ని తనిఖీ చేసి నిబంధనల ప్రకారం ఉంటే క్యూఆర్ కోడ్ కూడిన నిరభ్యంతర పత్రాన్ని జారీ చేస్తారన్నారు. బహిరంగ ప్రదేశాలలో ఏర్పాటు చేసే వినాయక మండపాలకు మాత్రమే ఈ అనుమతులు తప్పనిసరి అన్నారు. ఈ ఆన్లైన్ వ్యవస్థ ఉత్సవాలను సురక్షితంగా పారదర్శకంగా నిర్వహించడానికి ఉద్దేశింప బడిందని ఆయన పేర్కొన్నారు.

## వ్యక్తికి పాముకాటు



**చౌడేపల్లి - ఆంధ్రనాడు, ఆగస్టు 20:** విష సర్పం కాటేసిన వ్యక్తి అస్వస్థతకు గురైన సంఘటన బుధవారం చౌడేపల్లిలో చోటుచేసుకుంది. పశ్చిమ బెంగాల్ కు చెందిన రాజు అనే మేస్త్రి స్థానికంగా ఓ ఇంటిలో మేస్త్రి పని చేస్తుండగా కృష్ణ సర్పం కాటేసింది. గుర్తించిన అతన్ని స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇక్కడ అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మదనపల్లి ఏరియా ఆసుపత్రికి సిఫారసు చేశారు.

## ఉచిత వసతితో జర్మన్ భాషపై శిక్షణ

**తిరుపతి కలెక్టరేట్ - ఆంధ్రనాడు, ఆగస్టు 20:** జీఎన్ఎమ్, బీఎస్సీ అర్హత కలిగిన అనుభవం గల ఎస్సీ, ఎస్టీ మహిళ అభ్యర్థులకు ఉచిత వసతి సౌకర్యంతో కూడిన జర్మన్ భాషా ట్రైనింగ్ ప్రోగ్రాం ఈ నెల 22 న తిరుపతిలో ప్రారంభం కానుందని తిరుపతి జిల్లా ఎస్సి సంక్షేమ, సాధికారిత అధికారి జె. విక్రం కుమార్ రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, స్కిల్ డెవలప్మెంట్ శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోల బాలా వీరాంజనేయ స్వామి హాజరవుతున్నారు. అదేవిధంగా సాంఘిక సంక్షేమశాఖ సంచాలకులు బి.లావణ్యా వేణి, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారని, ఈ శిక్షణలో భాగంగా 25 మంది ఎస్సీ మహిళలు, 25 మంది ఎస్టీ మహిళలు ఎంపిక కాబడి, వారికి ఉచిత వసతి సౌకర్యం కల్పించబడుతుందని, జర్మన్ భాషా ట్రైనింగ్ ద్వారా ఉపాధి అవకాశాలను విస్తరించుకునే దిశగా ఈ కార్యక్రమం ఉపయోగకరమవు తుందని తెలిపారు. ఈ కార్యక్రమం తిరుపతిలోని శ్రీ బాబు జగజీవన్ భవనంలో, మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు ఆ ప్రకటనలో తెలియజేశారు.

## గడ్డంవారిపల్లి సర్పంచ్ భాగ్యవతికి ఘన సన్మానం



**చౌడేపల్లి - ఆంధ్రనాడు, ఆగస్టు 20:** స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఢిల్లీ ఎర్రకోటలో అరుదైన అవార్డు అందుకున్న గడ్డంవారి పల్లి సర్పంచ్ భాగ్యవతి హరినాథ్ స్థానిక వైకాపా నాయకులు ఘనంగా సన్మానించారు. బుధవారం పట్టణంలోని జంగాలపల్లి రమణ భవనంలో వైకాపా మండల అధ్యక్షుడు నాగభూషణ్ రెడ్డి, ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ప్రసంగిస్తూ పంచాయతీ నుంచి ఢిల్లీ స్థాయిలోకి వెళ్లి అవార్డు తీసుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. రాష్ట్ర మాజీ మంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆశీస్సులతో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. అవార్డు రావడం పట్ల రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, జెడ్పి మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డిలకు సర్పంచ్ భాగ్యవతి హరినాథ్‌లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రుక్మిణమ్మ, పార్టీ ఉపాధ్యక్షుడు జంగాలపల్లి రమణ, ఎంపీటీసీ తొండ శ్రీరాములు, సర్పంచులు కృష్ణారెడ్డి, సుబ్రమణ్యం రాజు, సుధాకర్ రెడ్డి, చెంగారెడ్డి, పవన్ రాయల్, నున్నభాస్కర్, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వినాయక విగ్రహాలకు అనుమతులు తప్పనిసరి



**కుప్పం - ఆంధ్రనాడు, ఆగస్టు 20:** కుప్పం మున్సిపాలిటీ పరిధిలో వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసే ప్రతి ఒక్కరు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని కుప్పం డి.ఎస్.పి పార్థసారథి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కుప్పం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో వినాయక చవితి పండగ సందర్భముగా వినాయక విగ్ర మండపములు పెట్టి పండగ జరుపుకొనే ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసు వారిచే ఆవిష్కరించబడ్డ వెబ్ సైట్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కమిటి సభ్యులు ముందుగా పై తెలిపిన వెబ్ సైట్ కు వెళ్లి మీ ఫోన్ నెంబర్‌ను ఎంటర్ చేసినచో మీకు ఒక ఓటిపి వస్తుందన్నారు. ఆ ఓటిపిని సదరు వెబ్ సైట్‌లో పొందుపరిచినచో ఒక అప్లికేషన్ డౌన్లోడ్ అవుతుందన్నారు. ఆ అప్లికేషన్ పేర్కొన్న అన్ని వివరాలతో సమాచారాన్ని నింపి ఓకే చేయాలన్నారు. అలా చేయడంతో ఆ అప్లికేషన్ లోకల్ పోలీస్ స్టేషన్‌కు చేరుతుందన్నారు. అప్లికేషన్ పరిశీలించిన పోలీసు వారు వినాయక విగ్రహ మండపములు పెట్టే ప్రదేశానికి వెళ్లి విచారించి అన్ని సక్రమంగా ఉన్న వినాయక విగ్రహ మండపములను ఆన్లైన్ ద్వారా అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే సభ్యులందరూ పోలీస్ వారు ఇచ్చే ఎన్వోసీ తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అప్లై చేసిన ప్రతి మండపానికి ఒక క్యూఆర్ కోడ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలా క్యూఆర్ కోడ్ లేని మండపాలను పోలీసుల అనుమతి లేని మండపంగా గుర్తించి అనుమతులు నిరాకరించబడతాయని హెచ్చరించారు. వినాయక విగ్రహాలను మూడవరోజు తప్పనిసరిగా నిమజ్జనం చేయాలని సూచించారు. ప్రశాంత వాతావరణములో వినాయక చవితి పండగ జరుపుకోవలసింది ప్రజలను కోరారు.

# శ్రమ జీవనానికి ప్రతీకలే జానపద గేయాలు



**రామచంద్రాపురం - ఆంధ్రనాడు, ఆగస్టు 20:** సమ జీవనానికి జానపద గేయాలు ప్రతీకలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమ్మ కండ్రిగ ప్రధానోపాధ్యాయురాలు సునీత అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ కమ్మ కండ్రిగ ప్రాంగణంలో ప్రధానోపాధ్యాయురాలు ఆధ్వర్యంలో మన సంస్కృతి కళామండలి సంస్థ వ్యవస్థాపకులు రెడ్డప్ప సహకారంతో జానపద గేయాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత మాట్లాడుతూ పల్లె ప్రజల జీవన విధానాన్ని ఆచార వ్యవహారాలను ప్రతిబింబింప చేసేది జానపదాలని పేర్కొన్నారు. జానపద గేయాలు ఉప్పొంగే ఉత్సాహాన్ని అతిశయించే ఆనందాన్ని ఇస్తాయని తెలిపారు. మన సంస్కృతి కళామండలి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రెడ్డప్ప గారు అనేక జానపద గేయాలను పాడి విద్యార్థులందరి నీ అలరింప చేశారు. జానపదాలపై చక్కటి అవగాహనను కల్పించారు. విద్యార్థుల చేత జానపద గేయాలను పాడించి ఉత్సాహ పరిచారు. పల్లెలలో వివిధ రకాల జానపద కళాకారులు ఉండేవారని కాలక్రమేన వారి ఉనికి ప్రశ్నార్థకమవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. సినిమాల ప్రభావం జానపద కళలకు ముప్పు వాటిల్లినదని వివరించారు. కొందరు కళాకారుల వలన జానపద కళలు జీవం పోసుకుంటున్నా యని చెప్పారు. జానపద గేయాలను పరిరక్షించి భవిష్యత్తు తరానికి అందించాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎల్ టిఏ జిల్లా అధ్యక్షులు దొడ్డ ఉమామహేశ్వర్, ఉపాధ్యాయులు విశ్వనాథం, ఐ.వెంకటరామయ్య, కృష్ణార్జున రెడ్డి, బ్రహ్మం, దిలీప్ కుమార్, శాంతి, లీలారాణి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చంద్రగిరి నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ





**తిరుపతి రూరల్ - ఆంధ్రనాడు, ఆగస్టు 20:** చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని తిరుపతి, పాకాల, రామ చంద్రాపురం, చంద్రగిరి, యర్రావారిపాలెం మండలాలకు చెందిన పలువురికి సిఎంఆర్ఎఫ్ సహాయ నిధి ద్వారా రూ.19,47,083 మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధుల చెక్కులను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని బుధవారం తిరుపతి రూరల్ మండలం తనపల్లి రఘునాథ్ రిసార్ట్స్ లోని తెదేపా పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనారోగ్యంతో, వివిధ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న

బాధితుల వివరాలను ఎమ్మెల్యే పులివర్తి నాని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా, సీఎం తక్షణమే స్పందించి సిఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధి కారులకు ఆదేశాలు జారీ చేశారు. చెక్కులు అందుకున్న బాధిత కుటుంబ సభ్యులు కష్టకాలంలో అండగా నిలిచిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే పులివర్తి నానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం నాయకులు, ప్రజా ప్రతినిధులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## హంద్రీ-నీవా పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**కుప్పం - ఆంధ్రనాడు, ఆగస్టు 20:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గ రైతులకు ప్రజలకు తాగు, సాగునీరు అందించే గొప్ప లక్ష్యంతో హంద్రీ-నీవా ద్వారా కృష్ణమ్మ జలాలు ఈ నెల 30 వ తేదీన కుప్పంకు తీసుకురానున్నారు. ఈ నేపథ్యంలో హంద్రీనీవా పనులను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం పరిశీలించారు. కుప్పం మునిసిపాలిటీ పరిధిలోని పరమసముద్రం చెరువు వద్ద జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... హంద్రీ-నీవా జలాలతో కుప్పం నియోజకవర్గంలోని 430 చెరువులు నింపనున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో చెరువుల సామర్థ్యం, చెక్ డ్యాంలను బాగు చేయడం, నీటినిల్వలో ఎలాంటి లోపాలు ఉండకుండా ముందస్తుచర్యలు తీసుకోవాలని ఇంజనీర్లను ఆదేశించారు. త్వరలో ముఖ్యమంత్రి పర్యటన ఉంటుందని తెలిపారు. పరమసముద్రం చెరువు నందు బహిరంగ సభ, జల హారతి, పైలాన్ ఆవిష్కరణకార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సంబంధిత ఇంజనీర్లు అందరూ జాగ్రత్తగా మీ విధులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ తెలుగు గంగా ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ ఎమ్ ఎల్ఎన్ వరప్రసాద్, హెచ్ఎన్ఎస్ఎస్ఎస్ ఈ విటల్ ప్రసాద్, కుప్పం హెచ్ఎన్ ఎస్ఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే గోవర్ధన గిరిధర రావు, రిత్విక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మరోసారి దాతృత్వాన్ని చాటుకున్న కనుగొండ మద్దిరెడ్డి

- సొంత నిధులతో మోడల్ స్కూల్ లో సరస్వతి దేవి ఆలయం నిర్మాణం
- ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ
- 80 మంది విద్యార్థులకు బస్ పాసులు పంపిణీ



**తంబళ్లపల్లి - ఆంధ్రనాడు, ఆగస్టు 20:** మదనపల్లి రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు, మల్లయ్య కొండ మాజీ చైర్మన్, దాత కనుగొండ మద్దిరెడ్డి మరోసారి దాతృత్వాన్ని చాటుకున్నారు. తన సొంత నిధులతో తంబళ్లపల్లె మోడల్ పాఠశాలలో సరస్వతీ దేవి ఆలయాన్ని నిర్మించి బుధవారం వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ఉదయమే వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కనుగొండ మద్దిరెడ్డి, పద్మావతమ్మ దంపతులు ప్రిన్సిపాల్ ఎంఈవో నాగ సుబ్బరాయుడు, హేమంత్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనంతరం మద్దిరెడ్డి సొంత నిధులతో పాఠశాలలో 6, 7 తరగతులు చదువుతున్న విద్యార్థులు (బాలురు) 80 మందికి ఉచితంగా బస్ పాసులు పంపిణీ చేసారు. ఈ సందర్బంగా మద్దిరెడ్డి మాట్లాడుతూ.. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగి చదివిన పాఠశాలకు, గ్రామానికి, తల్లితండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గత ప్రిన్సిపాల్ వెంకటేష్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ పోషణకు ఉపాధిగా డ్రోన్

## - సున్నా పెట్టుబడితో ప్రభుత్వం సాయం
## - ప్రభుత్వానికి ఏ రుణం ఇచ్చినా సరిపోదు : ధనలక్ష్మి గ్రూప్ సభ్యురాలు




**బైరెడ్డిపల్లి – ఆంధ్రనాడు, ఆగస్టు 20:** ఎక్కడ చూసినా డ్రోన్ వినియోగం జోరందుకొంటున్నది. వ్యవసాయ రంగంలో అయితే చాలా చక్కగా వాడేస్తున్నారు. ఒక్క డ్రోన్‌తో ఒక కుటుంభం ఊహించని స్థాయిలో ఉపాధి పొందుతున్నారు. అగ్రికల్చర్ సంస్థ ద్వారా రాయితీతో డ్రోన్ పొంది. రోజుకు రూ 2 వేలు సంపాదిస్తున్నాం. ఆంధ్రనాడు తెలుగు దినపత్రికతో పంచుకొన్నారు. గతంలో కూలీగా, రైతుగా పని చేసుకొనేవాళ్ళం. కానీ ప్రభుత్వ సహకారంతో రూ.2 లక్షలు తో డ్రోన్ పొంది మంచి లాభాలు ఆర్జిస్తున్నాంని హర్షం వ్యక్తం చేశారు. రైతన్నలు మా సేవలను వినియోగించుకోవాలని కోరారు. వ్యవసాయాన్ని లాభసాటి చేయాలని దేశంలోనే తొలోసారిగా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 80 శాతం రాయితీతో రైతులకు డ్రోన్ అందిస్తున్నది. వాటితో రైతన్నలు ఎరువులు, పిచికారీ చేసేలా చర్యలు తీసుకొంటున్నది. సాగుకు సాంకేతికతను జోడిస్తే ఖర్చులు ఆదా అవుతుందని, సేద్యం లాభా సాటిగా మారుతుందని అగ్రికల్చర్ ఏ ఓ గీతాకుమారీ తెలిపారు. ఒక యూనిట్ ధర రూ.8.9 లక్షలు. ఇందులో రైతు వాటా 1.96 లక్షలు. మిగిలిన 8 లక్షలు ప్రభుత్వమే భరిస్తున్నది. బైరెడ్డిపల్లి మండలం, పిచ్చిగుండ్లపల్లి గ్రామానికి చెందిన కుమారీ విజయా ధనలక్ష్మీ గ్రూప్‌లో సుమారు 7 సంవత్సరాలు గా సభ్యురాలుగా ఉన్నది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవతో మండలానికి ఒక్కటి పొదుపు సంఘాల తరుపునా సున్నా పెట్టుబడితో, 15 రోజులు శిక్షణ ఇచ్చి డ్రోన్ ఉచితంగా అందజేశారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సున్నా పెట్టుబడితో డ్రోన్ వితరణ చేసింది మొదట. డ్రోన్ వినియోగం పూర్తి స్థాయిలో రైతులకు మెరుగ్గా ఉపయోగపడాలనే లక్ష్యంతో రాయితీ డ్రోన్స్‌ను వితరణ చేస్తున్నది. బైరెడ్డిపల్లి మండలానికి చెందిన కృష్ణారెడ్డి తన భార్య కుమారీవిజయా ప్రభుత్వం ద్వారా డ్రోన్ పొంది, మొదట మండల స్థాయిలో డ్రోన్ పని తీరు మెరుగ్గా రైతులకు అందివ్వడంతో ఎక్కువ సంఖ్యలో డ్రోన్ ను వినియోగిస్తున్నారు. డ్రోన్‌తో సులువు కనుకొన్న రైతన్నలు ఎక్కువుగా డ్రోన్ వినియోగిస్తున్నారు. వీరి పనితనం చూసి రైతన్నలు వీరి సేవలను విరివిగా ఉపయోగించు కొంటున్నారు. రోజుకు రెండు ఎకరాలు చొప్పునా పిచికారీ దొరుకుతున్నది. ఇలా క్రమంగా పిచికారీ చేసి నెలకు రూ.1 లక్షకు పై చిలుకు సంపాదిస్తున్నారు. ఒక్క డ్రోన్ తో మండలమే కాదు సుమారు 4 నియోజక వర్గాలకు చెందిన రైతన్నలు వీరి సేవలను వినియోగించు కొంటున్నారు. డ్రోన్ వల్ల మా కుటుంభ పరిస్థితి మెరుగు పడిందన్నారు. డ్రోన్స్ గతంలో పొదుపు సంఘాల్లో ఉన్న వారికి సున్నా పెట్టుబడికే ఇచ్చారు. కానీ ఇప్పుడు 80 శాతం రాయితీతో ఇస్తున్నారు. డ్రోన్ అవసరం పడిన రైతన్నలకు 91 9396571749 ఈ నెంబర్‌కి కాల్ చేస్తే మీకు అందుబాటులోకి వస్తామని తెలిపారు.

# అర్హులైన వికలాంగులకు పింఛన్లు ఇవ్వాలి




**రేణిగుంట – ఆంధ్రనాడు, ఆగస్టు 20:** అర్హులైన వికలాంగులందరికీ పింఛన్లు తిరిగి మంజూరు చేయాలని రేణిగుంట పట్టణంలో సిపిఐ కార్యకర్తలు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. వికలాంగుల పెన్షన్ రద్దు చేసిన వారందరికీ పునరుద్ధరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి మాట్లాడుతూ అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేయాలని పునరుద్ధరణ పేరుతో వికలాంగులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ప్రభుత్వ హాస్పిటల్ లో సదరం సర్టిఫికెట్‌లో పర్సంటేజ్ తగ్గిస్తూ, పూర్తి అంగవైకల్యం ఉన్న వారికి పింఛన్లు నిలిపివేస్తున్నారని వాపోయారు. వికలాంగుల ప్రతిరోజు వందలాదిమంది సచివాలయాలు, కలెక్టర్ కార్యాలయాలు చుట్టూ తిప్పుకుంటున్నారని దుయ్యబట్టారు. తిరుపతి నగరంలోని వందలాదిమంది వికలాంగులకు పింఛన్లు రద్దు చేశారని, వికలాంగులకు అన్ని అర్హతలు ఉన్న సచివాలయంలో అప్లై చేస్తుంటే అనర్హులుగా గుర్తిస్తున్నారని అన్నారు. పింఛన్లు రద్దు చేసిన వికలాంగులు ఇంటికెళ్లి సచివాలయ సిబ్బంది విచారణ జరిపి వారు అర్హుల కాదా నిజ నిర్ధారణ చేసి వారికందరికీ పింఛన్లు ఇవ్వాలని కోరారు. కొంతమంది వికలాంగులకు పర్సంటేజ్ తక్కువ ఉందని, కరెంట్ బిల్లు ఎక్కువ వస్తుందని అనేక నిబంధనలతో వికలాంగులను హింసిస్తూ పింఛన్లు కట్ చేస్తున్నారని అన్నారు. తక్షణమే అర్హులైన వికలాంగులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే మహిళలకు ఆర్టీసీ బస్సులు ఫ్రీ అని రాష్ట్రంలో ఎక్కడైనా ఎక్కొచ్చు దిగొచ్చు అని ఆగస్టు 15వ తారీఖున రాష్ట్రమంతా పండుగ వాతావరణంలో నిర్వహించారని, ఇప్పుడు మహిళలు బస్సు ఎక్కితే ఈ బస్సు ఫ్రీ కాదు వేరే బస్సు ఎక్కండి మహిళలని తీవ్రమైనటువంటి ఇబ్బందులు గురి చేస్తూ ఉన్నారు. ఫ్రీ అన్న తర్వాత ఆర్టీసీ బస్సు ఏ బస్సు ఎక్కిన ఫ్రీగా మహిళలకు వర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తులసి రాజన్ ఏఐటియుసి మండల కార్యదర్శి కార్తీక్, మురళి, చంద్రకళ, సుబ్బరాజు, రమణ అమ్ములు, ఖాదరవల్లి, శివగామి, మనీ, మున్ని, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుల పెన్షన్లు తొలగించొద్దు




**శ్రీకాళహస్తి – ఆంధ్రనాడు, ఆగష్టు 20:** వికలాంగుల పెన్షన్లు తొలగించొద్దని కెవిపిఎస్ జిల్లా నాయకుడు సంక్రాంతి వెంకటయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో బుధవారం కెవిపిఎస్, డప్పు కళాకారుల సంఘం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓవైపు పెన్షన్ నగదు పెంచామంటూనే మరోవైపు తొలగింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అన్యాయమన్నారు. వికలాంగులకు సామాజిక భరోసా పెన్షన్ పేరుతో నెలకు రూ.6 వేలు ఇవ్వడం ఇష్టం లేక చంద్రబాబు ప్రభుత్వం వికలత్వ పర్సెంటేజీలు పేరు చెప్పి అన్యాయంగా తొలగింపు కార్యక్రమానికి దిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ నెలకు జిల్లా వ్యాప్తంగా 30 వేల మంది వికలాంగులు తమ పెన్షన్ హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదేంటని అడిగిన వికలాంగులకు మళ్లీ సదరం క్యాంపుకు వెళ్లి ధ్రువీకరణ పత్రాలు తెచ్చుకోండంటూ ఉచిత సలహాలివ్వడం అన్యాయమని వాపోయారు. వికలాంగులు మళ్లీ సదరం క్యాంపు నుంచి ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే కనీసం ఆరు నెలల సమయమైనా పడుతుందని వివరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రద్దయిన పెన్షన్లను పునరుద్ధరించాలని కోరారు. లేకుంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డప్పు కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు పెంచలయ్య, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వేణు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం



**శ్రీకాళహస్తి – ఆంధ్రనాడు, ఆగష్టు 20:** రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిడాక్టర్. ఎస్. బత్తెయ్య నాయుడు తెలిపారు. రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని బుధవారం శ్రీకాళహస్తి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బత్తయ్య నాయుడు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ 1984 లో 40 సంవత్సరాలకే దేశానికి 6వ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారని తెలిపారు. అలాగే దేశంలోని ప్రాంతాలతో సంబంధం లేకుండా మతాలకు, భాషలకు అతీతంగా జాతీయ సమైక్యతను మత సామరస్యాన్ని పెంపొందించగలిగారని చెప్పారు. అందువల్లే రాజీవ్ గాంధీ జయంతిని తద్భావన దినముగా జరుపుకోవడం జరుగుతుందన్నారు. దేశాభివృద్ధికి సాంకేతిక విద్య చాలా అవసరమని విశ్వసించిన గొప్ప నాయకుడు, సాంకేతిక సంస్కరణ ప్రవేశపెట్టిన ఘనత కూడా రాజీవ్ గాంధీకే దక్కిందన్నారు. అంతేకాకుండా మహిళలకు స్థానిక సంస్థల్లో 33% రిజర్వేషన్ కల్పించిన ఘనత రాజీవ్ గాంధీ దేనని చెప్పారు. ప్రజా స్వామ్యంలో యువత పాలుపంచుకునే దిశగా ఓటు హక్కును 21 సంవత్సరము నుండి 18 సంవత్సరాలకు తగ్గించి, పంచాయితీ రాజ్ సంస్థలను బలోపేతం చేసిన ఘనత రాజీవ్ గాంధీకి దక్కిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనార్ధన్ రెడ్డి, ఈర్ల.గోపి, సురేష్, అనిల్, నాగూరయ్య, మోహన్, ఆర్ముగం, నరేంద్ర, వనమ్మ, బానమ్మ, మస్తానమ్మ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# వెంకన్నకు వేడుకోలు

## - శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులు వినూత్న నిరసన



**తిరుపతి ప్రెస్ క్లబ్ – ఆంధ్రనాడు, ఆగస్టు 20:** శ్రీవారి మెట్టు చిరు వ్యాపారస్తులు టీటీడీ పరిపాలన భవనం వద్ద చేపట్టిన నిరసన దీక్ష పోరాటానికి ఒక సంవత్సరం నిండిన సందర్భంగా నిరసన దీక్ష శిబిరం వద్ద కుటుంబాలతో గురువారం వెంకన్నకు వేడుకోలు వినూత్న కార్యక్రమంలో పాల్గొంటున్నారని వ్యాపారస్తుల సంఘం కార్యదర్శి మధు బుధవారం ప్రెస్ క్లబ్‌లో తెలియజేశారు. టీటీడీ యాజమాన్యం, ప్రజా ప్రతినిధులు సానుకూల దృక్పథంతో సమస్యను పరిష్కరించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చిట్టిబాబు పెంచలయ్య యుగంధర్ శేఖర్ పాల్గొన్నారు.

# ఖచ్చితమైన సరిహద్దుల కోసమే భూముల రీ సర్వే : ఆర్డీవో భవాని



**చౌడేపల్లి – ఆంధ్రనాడు, ఆగస్టు 20:** ఖచ్చితమైన సరిహద్దుల కోసమే భూముల రీ సర్వే చేస్తున్నట్లు పలమనేరు ఆర్డిఓ భవాని అన్నారు. బుధవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో భూముల రీ సర్వే పై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ. రెవిన్యూ గ్రామాల సర్వే అవుతుందని, తర్వాత ప్రభుత్వ భూమి అనగా చెరువులు, వాగులు, వంకలు, వంటివి రి సర్వే చేస్తారన్నారు. తర్వాత రైతులకు సంబంధించిన పట్టాలు సర్వే అవుతాయన్నారు. ఈ తంతు అంతా మూడు నెలల్లో ముగిసేలా ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించేలా చర్యలు తీసుకోవాలని రెవిన్యూ అధికారులకు సూచించారు. రీ సర్వేను సమగ్రవంతంగా చేపట్టి అనుకున్న కాల పరిమితులో అందించాలని సూచించారు. అనంతరం రీ సర్వే అధికారులకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ పార్వతి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ పెన్లషన్లు అందజేస్తాం



**కార్వేటినగరం – ఆంధ్రనాడు, ఆగస్టు 20:** అర్హులైన పింఛన్ దారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కార్వేటి నగరం ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. వికలాంగులా పెన్షన్ కు సంబంధించి గత ప్రభుత్వంలో అనర్హులైన వారు కూడా పెన్షన్ తీసుకోవడంతో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఒక్కరికి కొత్తగా సదరం కు దరఖాస్తు చేసుకొని అర్హులైన వారు ఎంపీడీవోకు అప్పీల్ చేసుకోవాలని సూచించింది. ఇందులో భాగంగా బుధవారం మండల ఎంపీడీవోకు అప్పీల్ చేసుకోవడానికి కార్యాలయం వద్దకు మండలంలోని వికలాంగులు ఎంపీడీవో చంద్రమౌళికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారికి తప్పకుండా పెన్షన్‌ను అందజేస్తుందని, అనర్హులు ను గుర్తించి 60 సంవత్సరాలు ఉన్నవారికి వృద్ధాప్య పెన్షన్‌ను అందిస్తారని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు.

# వినాయక ప్రతిమల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

## - మండపాల వద్ద డీజే మ్యూజిక్ ఏర్పాటు నిషేధం : సీఐ హనుమంతప్ప



**కార్వేటినగరం – ఆంధ్రనాడు, ఆగస్టు 20:** వినాయక చవితిని పురస్కరించుకొని వీధుల్లో వినాయక ప్రతిమ ఏర్పాటుకు పోలీసు శాఖ నుండి అనుమతులు తప్పనిసరి అని కార్వేటి నగరం సీఐ హనుమంతప్ప తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వినాయక ప్రతిమ ఏర్పాటుకు నిర్వాహకులు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే పోలీస్ శాఖ పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తుందని సీఐ అన్నారు. వినాయక మండపాల వద్ద డిజె మ్యూజిక్ ఏర్పాటు రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిందని, ఎవరు డీజే మ్యూజిక్ ను పెట్టేందుకు అనుమతి లేదని సీఐ తెలిపారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక ప్రతిమలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు పొంది, డీజే మ్యూజిక్ లేకుండా పండుగను సంతోషంగా జరుపుకోవాలని, పోలీసు శాఖకు సహకరించాలని సీఐ కోరారు.

Printed, Published Edited and Owned by M.HARIBABU, Printed at AKSHARA PRINTERS, 1st Floor, SSS Complex, Air Bypass Road, Tirupati Town, Tirupati District, A.P.,
Published at AKSHARA PUBLICATIONS, Tirupati, Editor : M.Hari Babu , Cell : 9490400684, RNI: 2009/28733